Postal Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :04 సంచిక : 206 పేజీలు 8 వెల : 5 మంగళవారం 17 ఫిబ్రవరి 2026




## అండగా నాగబాబు



కోవా బన్ వ్యాపారి వలీకి జనసేన ఎమ్మెల్సీ నాగబాబు అండగా నిలిచారు. వలీని తన వద్దకు పిలిపించుకుని ఆయనకు ధైర్యం చెప్పారు. కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. న్యాయంగా వ్యాపారాలు చేసుకునే నిరుపేదలకు చేతనైతే చేయూత అందించాలని.. ఇలా తప్పుడు ఆరోపణలు చేసి కడుపు మీద కొట్టడం సరైంది కాదన్నారు నాగబాబు.. మరోవైపు మంత్రి అచ్చెన్నాయుడు, మంత్రి నారా లోకేష్ కూడా కోవా బన్ వ్యాపారి వలీకి మద్దతుగా నిలిచారు వలీకి రాజకీయ పార్టీల నుంచి మద్దతు లభిస్తోంది. ఇప్పటికే టీడీపీ నేతలు నారా లోకేష్, పరిటాల శ్రీరామ్, బైరెడ్డి శబరి వలీకి మద్దతు ప్రకటించారు. తాజాగా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు సైతం చిరు వ్యాపారి వలీకి అండగా నిలిచారు. వలీని తన వద్దకు పిలిపించుకున్న నాగబాబు అతనికి ధైర్యం చెప్పారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ విషయాన్ని నాగబాబు ఓ ప్రకటనలో వెల్లడించారు. కుటుంబ పోషణకు కోవా బన్ అమ్ముకునే ఓ సాధారణ పౌరుడైన వలీని.. పనిగట్టుకుని కొంతమంది భయభ్రాంతులకు గురిచేయడం సరైంది కాదని నాగబాబు అన్నారు. మనదేశంలో కోట్ల మంది.. చిరు వ్యాపారులు ఉన్నారని, అలాంటి వారికి చేతనైతే సహాయం చేసి చేయూత ఇవ్వాలే కానీ.. నిరాధార ఆరోపణలతో ఇలా కడుపు మీద కొట్టడం సరైంది కాదని నాగబాబు అన్నారు. న్యాయంగా వ్యాపారం చేసుకునేవారికి కూటమి సర్కారు అండగా ఉంటుందని నాగబాబు భరోసా ఇచ్చారు.

## ఏపీకి బిల్ గేట్స్..



మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకులు, గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్ గేట్స్ ఏపీలో పర్యటించారు. ఏపీ రాజధాని అమరావతి చేరుకున్న బిల్ గేట్స్ బృందం.. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లతో వివిధ అంశాలపై చర్చించింది. ఈ క్రమంలోనే ఏపీ ప్రభుత్వం రూపొందించిన స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్ మీద చర్చించారు. అనంతరం ఏపీ ప్రభుత్వం రియల్ టైమ్ గవర్నెన్స్ సిస్టమ్‌ను బిల్ గేట్స్ సందర్శించారు. ఏపీ ప్రభుత్వం చేపడుతున్న డిజిటల్ విధానాల గురించి తెలుసుకున్నారు. ఆ తర్వాత ఉండవల్లిలోని వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్న బిల్ గేట్స్.. అరటి తోటను పరిశీలించారు.

ఈ సందర్భంగా వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం గురించి అధికారులు బిల్ గేట్స్‌కు వివరించారు.

## ఇకపై 48 గంటల్లోనే ఆ కార్డు చేతికి ఇస్తారు




ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ముఖ్యమైన గమనిక.. ఉపాధి హామీ పథకానికి సంబంధించి కొత్త జాబ్ కార్డు ఇకపై వేగంగా జారీ చేస్తారు. కేంద్రం ఇటీవల ఉపాధి హామీ పథకానికి సంబంధించి మార్పులు చేసింది.(మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం) పేరును (వికసిత్ భారత్ గ్రామీణ రోజ్‌గార్ మిషన్)గా మార్చిన సంగతి తెలిసిందే. ఇక ఉపాధిహామీ పథకానికి సం బంధించి ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా కూలీల మస్టర్ (హాజరు) నమోదు చేస్తోంది. అలాగే ఒక్క కుటుంబానికి పని దినాలు 125 రోజులకు పెంచిన సంగతి తెలిసిందే. వేతనాలను కూడా త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఒకవేళ వేతనాల చెల్లింపులు ఆలస్యం అయితే పరిహారం అందిస్తారు.ఉపాధి హామీ పథకానికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నిధులు ఖర్చు చేస్తాయి. అయితే ఉపాధి హామీకి సంబంధించి జాబ్ కార్డు ఉంటుంది. అయితే ప్రజలకు కొత్త జాబ్‌కార్డు జారీ విధానాన్ని కేంద్రం మరింత సులభతరం చేసింది. దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లోనే జాబ్ కార్డును జారీ చేయనున్నారు. ఒకవేళ ఎవరికైనా జాబ్ కార్డు కావాలవంటే ఆయా గ్రామాల్లో ఉండే ఫీల్డ్ అసిస్టెంట్‌ను సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు. జాబ్ కార్డు కోసం ఈకేవైసీ పూర్తి చేస్తే దరఖాస్తు ప్రక్రియ పూర్తవుతుంది. ఈ మేరకు దరఖాస్తుల్ని పరిశీలించిన తర్వాత అధికారులు నిర్దేశిత సమయంలో జాబ్ కార్డు జారీ చేస్తారు. జాబ్ కార్డులు ఉన్న ఉపాధి హామీ కూలీలకు సంబంధించిన ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేశారు. అలాగే ఉపాధి పనుల కోసం వచ్చిన కూలీలు కచ్చితంగా ఫేస్ రికగ్నేషన్ ద్వారా (ముఖ ఆధారిత) హాజరు వేయాల్సిందే. గతంలో ఉపాధి హామీ పనులకు సంబంధించి అవకతవకలు జరిగాయి. కొందరు ఒకటి రెండు చోట్ల పేర్లను నమోదు చేయించుకున్నారు. అలాగే ఒకరికి బదులు మరొకరు పనికి వెళ్లేవారు. అసలు పనికి రాకపోయినా సరే కొందరు మస్టర్లు వేశారు. ఇలా ఎన్నో లోటుపాట్లను గుర్తించిన తర్వాత కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్రం ఆదేశాలతో ముఖ ఆధారిత హాజరును నమోదు చేస్తున్నారు.. ప్రస్తుతం ఈ విధానం అమల్లో ఉన్నా.. మార్పి తర్వాత పూర్తిగా అమల్లోకి తీసుకొస్తారని చెబుతున్నారు. అప్పుడు ఎలాంటి అవకతవకలకు అవకాశం ఉండదు అంటున్నారు. మొత్తం మీద ఉపాధి హామీ పథకంలో మార్పులతో పాటుగా జాబ్ కార్డుని వేగంగా జారీ చేస్తారు.. అదే సమయంలో హాజరు విషయంలో కూడా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అలాగే రాష్ట్రంలో ఎవరికైనా జాబ్ కార్డులు కావాలంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు

## దోమలపై హైటెక్ యుద్ధం..



ప్రజారోగ్యానికి పెను సవాల్ విసురుతున్న దోమలపై హైటెక్ యుద్ధానికి ఏపీ ప్రభుత్వం సిద్ధమైంది. దోమల నియంత్రణ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సేవలు ఉపయోగించనుంది. ఏఐ ఆధారంగా పనిచేసే స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్ ద్వారా దోమలను కట్టడి చేయాలని భావిస్తోంది. ఇందులో భాగంగా తిరుపతిలో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ విధానాన్ని పరిశీలించనున్నారు. అక్కడ వచ్చే ఫలితాల ఆధారంగా మరిన్ని నగరాలకు విస్తరించాలనే ఆలోచనలో ఏపీ ప్రభుత్వం ఉంది. తిరుపతిలో ప్రైవేట్ సంస్థకు ఈ పనులు అప్పగించనున్నారు. ప్రజారోగ్యానికి ప్రధాన సవాలు విసురుతున్నవి దోమలే.. ఈ నేపథ్యంలో దోమలపై హైటెక్ యుద్ధానికి ఏపీ ప్రభుత్వం సిద్ధమైంది. టెక్నాలజీ సాయంతో దోమలకు చెక్ పెట్టాలని భావిస్తోంది. అందులో భాగంగా కృత్తిమ మేధ ఆధారంగా పనిచేసే స్మార్ట్ దోమల నిఘా వ్యవస్థ (స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్) అందుబాటులోకి తెస్తోంది ఏపీ ప్రభుత్వం. ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో తొలుత ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా పరిశీలించనున్నారు.

## కొత్త ఉద్యోగంలో చేరిన జేడీ లక్ష్మీనారాయణ..



వాసగిరి వెంకట లక్ష్మీనారాయణ.. ఈ పేరు చెప్పగానే చాలా మందికి ఆయనెవరో గుర్తు రాకపోవచ్చు. కానీ జేడీ లక్ష్మీనారాయణ అంటే చాలు ఠక్కున గుర్తుపడతారు. సీబీఐ అధికారిగా జగన్ అక్రమాస్తుల కేసు సహా అనేక హై ప్రొఫైల్ కేసులను దర్యాప్తు చేయడంతో ఆయన పేరు అప్పట్లో మార్మోగింది. మహారాష్ట్ర కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అయిన వీవీ లక్ష్మీనారాయణ .. ముంబైలో అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ జనరల్‌గా పదవీ విరమణ పొందారు. అనంతరం రాజకీయా ల్లోకి వచ్చిన ఆయన జనసేన తరఫున విశాఖ పట్నం ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత 2023లో జై భారత్ నేషనల్ పార్టీ పేరిట సొంత పార్టీ పెట్టారు. అంతకు ముందు తూర్పుగోదావరి జిల్లా ధర్మవరంలో ఆయన పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం కూడా చేశారు. ఆయన కుమారుడు కూడా ఆలిండియా సర్వీసులో పని చేస్తున్నారు.

తాజాగా ఓ ఉన్నత ఉద్యోగంలో చేరారు. ఈవీట్రాన్స్ ప్రైవేట్ లిమి టెడ్‌లో ఆపరేషన్స్ విభాగంలో వైస్ ప్రెసిడెంట్‌గా ఆయన చేరారు. ఈవీ ట్రాన్స్ అనేది మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ ( మెయిల్)కు అనుబంధ సంస్థ. ఐపీఎస్ అధికారిగా దాదాపు మూడు దశాబ్దాలపాటు సుదీర్ఘ సేవలు అందించిన జేడీ లక్ష్మీనారాయణను ఈవీట్రాన్స్ వైస్ ప్రెసిడెంట్‌గా తీసుకోవడానికి కారణం ఉంది.

జేడీ లక్ష్మీనారాయణ ఎన్ఐటీ వరంగల్ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ చదివారు. అనంతరం ఐఐటీ మద్రాస్ నుంచి ఎంటెక్ పూర్తి చేశారు. తర్వాత అశోక్ లేల్యాండ్ ఆర్ అండ్ డీ విభాగంలో కెరీర్ మొదలుపెట్టారు. ఆ సమయంలో కమర్షియల్ వెహికల్ సిస్టమ్, మాన్యుఫ్యాక్చరింగ్ ఎన్విరాన్మెంట్స్ మీద ఆయన అనుభవం సంపాదించారు.

ఈవీట్రాన్స్ సంస్థ ఎలక్ట్రిక్ బస్సుల తయారీని వేగవంతం చేస్తోంది. ఈ క్రమంలో లక్ష్మీ నారాయణ అనుభవం, కార్య దక్షత తమకు ఉపకరిస్తాయని ఆ సంస్థ భావిస్తోంది. లక్ష్మీనారా యణ నియామకం విషయాన్ని ఈవీట్రాన్స్ సంస్థ లింక్డ్ఇన్ ద్వారా స్వయంగా వెల్లడించింది. 2006–13 మధ్య డిప్యూటేషన్ మీద సీబీఐకి వెళ్లిన లక్ష్మీనారాయణ.. జాయింట్ డైరెక్టర్ స్థాయి కి ఎదిగారని.. ఈ సమయంలో ఆయన అనేక హైప్రొఫైల్ కేసులను దర్యాప్తు చేశారని కూడా ఈవీట్రాన్స్ గుర్తు చేసింది.

తెలంగాణ ఆర్టీసీలో నడుస్తోన్న ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సులను ఈ సంస్థే తయారు చేసింది. ఒక్క తెలంగాణ ఆర్టీసీనే కాకుండా.. ముంబై, పుణే, గోవా తదితర ప్రాంతాల్లో ఈ సంస్థ తయారు చేసిన ఎలక్ట్రిక్ బస్సలు పరుగులు తీస్తున్నాయి. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తోన్న ఈవీట్రాన్స్.. దేశంలోనే అతిపెద్ద ఎలక్ట్రిక్ బస్ ఆపరేటర్‌గా అవతరించింది.

## కొలంబోలో ప్రత్యక్షమైన నారా లోకేష్..




టీ20 ప్రపంచకప్‌లో భాగంగా కొలంబో వేదికగా జరిగిన ఇండియా పాకిస్థ?న్ మ్యాచ్‌లో ఏపీ మంత్రి నారా లోకేష్ సందడి చేశారు. టీమిండియా జెర్సీ ధరించి.. త్రివర్ణ పతాకాన్ని పట్టుకుని భారత జట్టును ప్రోత్సహిస్తూ నారా లోకేష్ కనిపించారు. దీనికి సంబంధించిన ఫోటోలను నారా లోకేష్ సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. క్రికెట్‌ను మించిన థ్రిల్ మరొకటి ఉండదని.. నారా లోకేష్ ట్వీట్ చేశారు. మరోవైపు ఈ ప్రతిష్టాత్మక మ్యాచ్ నేపథ్యంలో కొలంబో స్టేడియం ప్రేక్షకులతో నిండిపోయింది.

చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ మధ్య క్రికెట్ మ్యాచ్ అంటే క్రికెట్ ప్రేమికులకు అంతకుమించిన విషయం ఉండదు. ఇక ప్రపంచకప్ వంటి ఐసీసీ టోర్నీలలో తలపడుతున్నాయంటే అంతకు మించి వేరే పండుగ ఉండదు. ఏపీ మంత్రి నారా లోకేష్ మంచి క్రికెట్ లవర్ అనే సంగతి తెలిసిందే. క్రికెట్ మ్యాచ్ ఉందంటే చాలు వీలు దొరికితే అక్కడ వాలిపోతుంటారు.

ఈ క్రమంలోనే ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో భాగంగా కొలంబోలో జరిగిన ఇండియా పాకిస్థాన్ మ్యాచ్‌లో ప్రత్యక్షమయ్యారు నారా లోకేష్. వేలమంది ప్రేక్షకుల నడుమ భారత జట్టును ప్రోత్సహిస్తూ కనిపించారు. దీనికి సంబంధించిన ఫోటోలను నారా లోకేష్ తన ఎక్స్ ఖాతా వేదికగా సోషల్ మీడియాలో పంచుకున్నారు. "ఈ రాత్రి కొలంబో సందడిగా ఉంది! దిగ్గజాల మధ్య జరిగే మ్యాచ్‌లో టీమ్ ఇండియా కోసం నేను ఉత్సాహంగా నినాదాలు చేస్తున్నా – ఇండియా జం పాకిస్తాన్!లక్షలాది మందిని ఒకే హృదయ స్పందనతో ఏకం చేసే క్రికెట్ థ్రిల్‌కు మించినది మరొకటి లేదు. రండి – దేశాన్ని గర్వపడేలా చేయండి!"అంటూ నారా లోకేష్ ట్వీట్ చేశారు.

మరోవైపు నారా లోకేష్ గతంలోనూ ఇండియా పాకిస్తాన్ క్రికెట్ మ్యాచులకు హాజరయ్యారు. ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా గతేడాది ఫిబ్రవరిలో దుబాయి వేదికగా ఇండియా పాకిస్థాన్ మ్యాచ్ జరిగింది.ఈ మ్యాచ్‌కు కుమారుడు దేవాన్ష్‌తో పాటుగా హాజరయ్యారు నారా లోకేష్. ఈ సందర్భంగా ఐసీసీ ఛైర్మన్ జైషాతో భేటీ అయిన ఫోటోలు సోషల్ మీడియాలోనూ వైరల్ అయ్యాయి. ఈ భేటీలో ఏపీలో క్రికెట్ అభివృద్ధిపై జైషాతో నారా లోకేష్ చర్చించారు. అలాగే క్రికెటర్లు తిలక్ వర్మ, అభిషేక్ శర్మలతో దిగిన ఫోటోలు కూడా వైరల్ అయ్యాయి. ఇక ఇండియా పాకిస్థాన్ మ్యాచ్ విషయానికి వస్తే టీ20 ప్రపంచకప్‌లలో ఇప్పటి వరకూ ఈ రెండు జట్లూ ఎనిమిది సార్లు తలపడ్డాయి. ఏడుసార్లు భారతజట్టు గెలుపొందితే.. ఒకసారి పాకిస్థాన్ విజయం సాధించింది. ఈ రికార్డును మెరుగుపరుచుకోవాలని ఇరుజట్లూ భావిస్తున్నాయి.

## ఇలాపురం వెంకయ్య మృతి..



ప్రముఖ బీసీ నేత, మాజీ ఎమ్మెల్సీ ఇలాపురం వెంకయ్య (93) కన్నుమూశారు. వయో భారంతో కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నిన్న విజయవాడలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. పేద కుటుంబంలో జన్మించిన వెంకయ్య కష్టపడి ఎదిగి, విజయవాడలో సుమారు మూడు దశాబ్దాల క్రితం 'హోటల్ ఐలాపురం'ను స్థాపించి గుర్తింపు పొందారు. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం పనిచేసిన ఆయన.. స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు.
బీసీల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసిన వెంకయ్య.. బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. అలాగే శాలివాహన సంఘం అధ్యక్షుడిగా సేవ లం దించారు. సామాజిక సేవలోనూ ముందుండిన ఆయన.. విద్యాసంస్థలకు ఫర్నిచర్ అందిం చడం, విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వడం, అన్నదాన సత్రాలు ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయాలు, చర్చిలు, మసీదులకు విరాళాలు అందిస్తూ మతసామరస్యాన్ని చాటుకున్నారు. వెంకయ్య అంత్యక్రియలను సోమవారం నిర్వ హించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలి పారు. ఆయన కుమారుడు రాజా గతంలో సమాచార హక్కు చట్టం కమిషనర్‌గా పనిచేశారు. వెంకయ్య భౌతిక కాయాన్ని వివిధ రాజకీయ పక్షాల నేతలు, ప్రముఖులు సందర్శించి నివాళు లర్పిస్తున్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నారు.

## రైతులకు గుడ్‌న్యూస్.. వడ్డీ లేకుండా రుణాలు..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రం సహకారం తో రాష్ట్రంలో పథకాలను అమలు చేస్తోంది. కొన్ని పథకాల గురించి ప్రజలక అవగాహన లేకపోవడం వల్ల ఉపయోగించు కోలేక పోతున్నారు. రాష్ట్రంలో పాడి రైతుల కోసం.. పశువుల పెంపకంతో పాటుగా దాణా కొనుగోలు, అలాగే ఇతర ఖర్చుల కోసం అతి తక్కువ వడ్డీకి రుణాలు అం దించాలని నిర్ణయించారు.

ఈ మేరకు కిసాన్ క్రెడిట్ కార్డుల పథకాన్ని అమలు చస్తున్నారు. ఈ పశుకిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా పాడి రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలను అందిస్తారు. ఈ నిధు ల్ని పాడి రైతులు ఖర్చుల కోసం ఉపయోగించు కోవచ్చు.

ఈ పశు కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా పాడి రైతులకు రూ.3 లక్షల వరకు రుణాలు ఇస్తారు. అయితే రూ.1.60 లక్షల వరకు ఎలాంటి పూచీ కత్తు లేకుండా బ్యాంకు నుంచి రుణం తీసుకుని 40 రోజుల్లో కనుక చెల్లిస్తే వడ్డీ కూడా ఉండదు. ఆ తర్వాత 7శాతం వడ్డీ కట్టాల్సి ఉంటుంది. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాన్ని తిరిగి ఏడాదిలోగా చెల్లిస్తే.. ఆర్బీఐ, నాబార్డ్ 3శాతం వడ్డీ మినహాయిస్తారు. ఈ కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా ఆన్‌లైన్ చెల్లింపులు చేసే సదుపాయం కూడా అందుబాటులో ఉంది. అర్హులైన రైతులు ఈ పశు కిసాన్ క్రెడిట్ కార్డుల్ని తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ కిసాన్ క్రెడిట్ కార్డుల కోసం పశుసంవర్ధకశాఖకు సంబం ధించిన సహాయకుల్ని కలిస్తే మరిన్ని వివరాలు చెబుతున్నారు.

అర్హులకు పశుకిసాన్ క్రెడిట్ కార్డుతో పాటుగా పాస్‌బుక్ కూడా అందిస్తారు. రైతులు ఈ కిసాన్ క్రెడిట్ కార్డులకు సంబంధించిన కేవైసీ కోసం ఆధార్, పాన్, ఓటరు గుర్తింపు కార్డులతో పాటుగా.. భూమికి సంబంధించి డాక్యుమెంట్లు, పశువులకు సంబంధించి ఆరోగ్య హెల్త్ రికార్డ్, పాస్‌పోర్టు సైజు ఫోటోలు సమర్పించాలి.

## ఏపీ స్కూల్ విద్యార్థులకు పూర్తిగా ఉచితం..



ఏపీ ప్రభుత్వం స్కూల్ విద్యార్థులు, యువతకు ముఖ్యమైన అలర్ట్ ఇచ్చింది. ఈ నెల 17న ప్రతి ఒక్కరూ ఆల్బెండజోల్ టాబ్లెట్లు వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. రాష్ట్రంలో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ మేరకు పిల్లలకు నులి పురుగుల్ని నివారించడానికి ఈ టాబ్లెట్లు పంపిణీ చేస్తున్నారు. ఈ మేరకు వైద్యఆరోగ్యశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది.. టాబ్లెట్లను ఆయా జిల్లాలకు పంపించిది.
ఆంధ్రప్రదేశ్‌లో స్కూల్ విద్యార్థులు, యువతకు ముఖ్యగమనిక.. కడుపులో నులి పురుగులకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా చిన్నపిల్లలు కడుపులో నులి పురుగుల కారణంగా ఇబ్బందిపడుతుంటారు. కొందరు పిల్లలు రక్తహీనతకు గురయ్యే ప్రమాదం ఉంది. ఈ క్రమంలో ఈనెల 17న చిన్నారులు, యువత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఓ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఏపీ వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో 'నులిపురుగులను నులిమేద్దాం' అనే నినాదంతో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నారు. ఈ టాబ్లెట్లను పూర్తిగా ఉచితంగా అందజేస్తారు. పిల్లలు, యువత బహిరంగంగా మలవిసర్జనకు వెళ్లినప్పుడు కొన్ని నట్టల గుడ్లు మట్టిలో చేరి ఉంటాయి. అవి ఆయా మార్గాలలలో జీర్ణాశయంలోకి చేరతాయి.. ఇవి కడుపులో చేరితే అనారోగ్యానికి గురవుతారు.. అప్పటి నుంచి అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. అంతేకాదు చెప్పులు లేకుండా మట్టిలో నడిచినా సరే శరీరం ద్వారా ఇవి మెల్లిగా జీర్ణకోశంలోకి వెళతాయి. నులి పరుగులు కడుపులో చేరగానే అనారోగ్యో సమస్యలు మొదలవుతాయి.. ముఖ్యంగా ఆకలి ఉండదు, కడుపు నొప్పి వస్తుంది, బరువు తగ్గుతారు, కడుపు ఉబ్బరంగా ఉంటుంది, ఒంటిపై దద్దర్లు వస్తాయి, రక్తహీనత, ఆయాసం, కాళ్ల వాపులు, మొహం ఉబ్బిపోవడం, న్యుమోనియా, ఆయాసం కూడా వస్తుంది.
అందుకే ఈ నులి పురుగులకు చెక్ పెట్టేందుకు ఏడాదిలో రెండు సార్లు ఆల్బెండజోల్ 400 మిల్లీ గ్రాముల టాబ్లెట్ వేసుకుంటే సరిపోతుంది. ఈ టాబ్లెట్ ఆ నులి పురుగుల్ని నిర్మూలిస్తుంది. ఈ మేరకు ఆల్బెండజోల్ టాబ్లెట్‌ను ఆయా వయసును బట్టి అందిచాల్సి ఉంటుంది.'2 నుంచి 5 ఏళ్ల వయసున్న పిల్లలు అర టాబ్లెట్ వేయాలి.. అదే 6 నుంచి 19 ఏళ్ల లోపు వారికి మొత్తం టాబ్లెట్ వేయాలి' అని డాక్టర్లు సూచిస్తున్నారు. ఈ మేరకు ఆయా జిల్లాల వారీగ టాబ్లెట్లను వైద్య ఆరోగ్యశాఖ పంపించేసింది. అన్ని జిల్లాల్లోని ఆరోగ్య కేంద్రాల పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలు, స్కూల్స్, కాలేజీలకు టాబ్లెట్లు పంపిణీ చేశారు.

# హంగ్ మున్సిపాలిటీల్లో చక్రం తిప్పిన హస్తం

**హైదరాబాద్:** నిజామబాద్ కార్పోరేషన్ను కైవసం చేసుకుంది. మొత్తం ఏడు మున్సిపల్ కార్పొరేషన్లకు సోమవారం మేయర్, డిప్యూటీ మేయర్ల ఎన్నిక జరిగింది. మెజార్టీ ఛైర్మన్లు, వైస్ ఛర్మన్లు హస్తగతం అయ్యాయి. ఎంఐఎం మద్దతుతో నిజామాబాద్‌లో పాగా వేసింది. హంగ్ మున్సిపాలిటీల్లో చక్రం తిప్పిన హస్తం ఫలితాన్ని సాధించింది. ఏడు కార్పోరేషన్లలో ఐదింటిని దక్కించుకున్న కాంగ్రెస్, కొత్తగూడెంలో సిపిఐకి మద్దతు ప్రకటించింది. కరీంనగర్ పీఠంపై జెండా పాతిన బిజెపి నిజామాబాద్‌లో ఖంగు తింది. కరీంనగర్, నిజామాబాద్,రామగుండం, మహబూబ్‌నగర్, నల్లగొండ, మంచిర్యాల, కొత్తగూడెం కార్పొరేషన్లకు మేయర్, డిప్యూటీ మేయర్లను ఎన్నుకున్నారు. ఆయా కార్పొరేషన్లలో ఎన్నికైన వారి వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకుంది. మేయర్: కొలగాని శ్రీనివాస్ (బీజేపీ),డిప్యూటీ మేయర్: వై.సునీల్ రావు (బీజేపీ) ఎన్నియ్యారు. నిజామాబాద్ కార్పొరేషన్ మేయర్: ఉమారాణి (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: సల్మాతాహిన్ (ఏఐఎంఐఎం) ఎన్నికయ్యారు. ఇక్కడ ఎంఐఎం మద్దతుతో నిజామాబాద్‌పై పాగా వేశారు. నిజానికి బిజెపి మెజార్టీ సీట్లు సంపాదించిన లాభం లేకుండా పోయింది. రామగుండం కార్పొరేషన్‌లో మేయర్: మహంకాళి స్వామి (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: పాతిపల్లి ఎల్లయ్య (కాంగ్రెస్)లు ఎన్నియ్యారు. నల్గొండ కార్పొరేషన్ మేయర్: ముర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: మహమ్మద్ అష్రఫ్ అలీ అమర్ (ఏఐఎంఐఎం)లు ఎన్నికయ్యారు. మంచిర్యాల కార్పొరేషన్ మేయర్: ధరణి మధుకర్ (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: సల్ల రమ్య మహేశ్ (కాంగ్రెస్) ఎన్నికయ్యారు. కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్: మూడ్ గణెళిశ్ (సీపీఐ)డిప్యూటీ మేయర్: సిరిపురపు లలిత కుమారీ (కాంగ్రెస్) ఎన్నికలయ్యారు. మేయర్, డిప్యూటీ మేయర్ పదవులుపై సీపీఐ, కాంగ్రెస్ ఒప్పందం చేసుకున్నాయి. మహబూబ్‌నగర్ కార్పొరేషన్ మేయర్గా గుమల్ మమత (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: ఎం సురేందర్ రెడ్డి (కాంగ్రెస్) ఎన్నికయ్యారు. ఇకపోతే హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా 11 మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ఎన్నికలు వాయిదా పడ్డాయి. పలుచోట్ల బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు ప్రమాణ స్వీకారోత్సవానికి గైర్హాజరయ్యారు. దీంతో కోరం లేక పాలకమండలి ఎన్నికను వాయిదావేస్తున్న ట్లు అధికారులు ప్రకటించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, ఇంద్రేశం, భద్రాద్రికొత్తగూడెం జిల్లా ఇల్లందు, జనగామ, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్, నిర్మల్ జిల్లా ఖానాపూర్, మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి, ఇబ్రహీం పట్నం, ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్, మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ బల్దియాలో చైర్మన్, వైస్ చైర్మనేపేర్లు ఇంకా ఖరారు కాలేదు. ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కోరం లేకపోవడంతో వాయిదా పడింది. 12 మంది కౌన్సిలర్లకు గాను కాంగ్రెస్ పార్టీకి చెందిన ముగ్గురు, ఒక్క ఇండి పెండెంట్ కౌన్సిలర్ మాత్రమే సమావేశానికి హాజరై ప్రమాణ స్వీకారం చేశారు. మిగతా నలుగురు బీజేపీ సభ్యులు, నలుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు గైరాజరయ్యారు. దీంతో కోరం లేక ఎన్నికలు వాయిదా వేశారు. బీజేపి, బీఆర్ఎస్ ల మధ్య జరిగిన మంతనాలు సయోధ్య కుదరలేదని తెలుస్తోంది. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపల్ఆఫీస్ వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ శ్రేణులు ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. దీంతో సుమారు రెండు గంటలు సేపు అక్కడ గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ఉదయం 10.30గంటలు కు మున్సిపల్ కార్యాలయానికి చేరుకోవాల్సిన కౌన్సిలర్లు..12.00 గంటల వరకు కూడా ఎవరు రాలేదు. దీంతో కోరం లేకపోవడంతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను రేపటికి వాయిదా వేస్తున్నట్లు మందమర్రి తహసీల్దార్, ప్రత్యేక అధికారి సతీష్ కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఇక ఈ అవమానాన్ని భరించలేను

**జగిత్యాల:** కాంగ్రెస్ మెజార్టీ స్థానాలు కైవసం చేసుకున్నప్పటికీ.. ఛైర్మన్ పదవి ఎవరికి ఇస్తారన్న దానిపై ప్రతిష్టంభన ఏర్పడింది. ఈ క్రమంలోనే జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ వర్గీయులు క్యాంప్ రాజకీయాలు చేశారు. చివరికి సంజయ్ వర్గానికి చెందిన వ్యక్తి ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. దీంతో జీవన్‌రెడ్డి అసహనానికి గురైనట్లు సమాచారం. ఈ ఎన్నిక ముగింపు కాదు.సోమవారం జీవన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్ ఉన్నంతకాలం నాకు వేధింపులు తప్పవు. పవర్ ఆఫ్ అటార్నీ ఎమ్మెల్యే సంజయ్‌కు రాసిచ్చారా అంటూ ఆవేదన చెందారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు జగిత్యాల కాంగ్రెస్ పట్టా రాసిచ్చారు. ఎమ్మెల్యే పార్టీ మారలేదని స్పీకర్ అంటున్నారు. ఆయన మాత్రం కాంగ్రెస్ పార్టీతో సంసారం చేస్తున్నారు. కార్యకర్తల మనోభావాలను పార్టీ అధినాయకత్వం గౌరవించాలి. జగిత్యాలలోనే ఇలా ఉంటే.. పార్టీ మారిన మరో 9 ప్రాంతాల్లో ఎలా ఉందో..అని జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ ఎంపిక విషయంలో కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అసంతృప్తితో ఉన్నారు. తన ప్రతిపాదనను కాదని, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గానికి అధిష్టానం ప్రాధాన్యత ఇవ్వడంతో ఆయన కలత చెందారు. తన వర్గానికి చెందిన వ్యక్తికి కాకుండా.. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గానికి చెందిన సమిండ్ల వాణిని జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్‌గా ఎంపిక చేయడాన్ని ఆయన అవమానంగా భావిస్తున్నారు. 'నా గురించి, పార్టీతో నాకు ఉన్న అనుబంధం గురించి మీకు తెలుసు. పార్టీలో కొనసాగాలనే విషయంపై ఆలోచించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆయన ఎవరో వచ్చి మా మీద ఆధిపత్యం చెలాయిస్తున్నారు. మా హక్కులను కాలరాస్తున్నారు.

## కరీంనగర్‌పై బిజెపి జెండా

**కరీంనగర్:** డిప్యూటీ మేయర్‌గా అదే పార్టీకి చెందిన సునీల్‌రావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి ప్రకటించారు. మేయర్ పీఠాన్ని దక్కించుకోవడంలో కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యూహాత్మకంగా వ్యవహరించారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో భాజపా అత్యధికంగా 30 స్థానాల్లో గెలిచి నప్పటికీ మ్యాజిక్ సంఖ్యను చేరుకొని పీఠాన్ని కైవసం చేసుకుంటుందా.. అనే విషయంలో సందిగ్ధత కొనసాగింది. ఎట్టి పరిస్థితుల్లో మేయర్ పీఠాన్ని దక్కించుకుంటామని కేంద్ర మంత్రి బండి సంజయ్ రెండ్రోజుల క్రితం ధీమా వ్యక్తం చేసినా ఆదివారం చోటుచేసుకున్న పరిణామాలు ఆసక్తిని రేపాయి. కాంగ్రెస్, భారాస, ఎంఐఎం, ఆల్ఇండియా ఫార్వర్డ్ బ్లాక్(ఏఐఎఫ్‌బీ) సభ్యులు, స్వతంత్రులు కలిసి ఎలాగైనా కార్పొరేషన్‌ను తమకు అనుకూలంగా మలచుకోవాలనే విధంగా చక్రం తిప్పారు. ఇందులో భాగంగానే హైదరాబాద్ నగర శివారులోని ఓ రిసార్టులో వేర్వేరుగా క్యాంపులు నిర్వహించారు. మేయర్ పదవి కోసం ఇరువర్గాలు భాజపా, కాంగ్రెస్ మధ్య సంఖ్యాపరంగా దోబూచులాట కొనసాగింది. చివరికి మేయర్ పీఠాన్ని భాజపా దక్కించుకోవడంతో ఉత్కంఠకు తెరపడింది. ఈ ఎన్నికలో కాంగ్రెస్ మేయర్ అభ్యర్థికి 21 మంది కార్పొరేటర్లు మద్దతు పలికారు.

# అన్నిరంగాల్లో కృత్రిమ మేధ వినియోగం

**న్యూఢిల్లీ:** ఏఐ వాడకంలో అప్రమత్తత అవసరమని..దీనిని తప్పుడు సమాచార వ్యాప్తి కోసం వాడితే దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థ దెబ్బతినే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. ఢిల్లీలో ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ ప్రారంభం కానున్న నేపథ్యంలో.. నిర్వహించిన ఓ కార్యక్రమంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఏఐ ద్వారా విద్య, వైద్య, వ్యవసాయం, పరిపాలన వంటి అన్ని రంగాల్లో పనులు సులభమవుతు న్నాయని కేంద్రమంత్రి పేర్కొన్నారు. కాబట్టి దేశప్రజలందరూ కృత్రిమ మేధపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భారత్ వంటి అధిక జనాభా గల దేశాల్లోని ప్రజలకు డిజిటల్ అక్షరాస్యత లేకపోతే సైబర్ నేరాలకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి కృత్రిమ మేధ వినియోగంపై పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. పాఠ్యాంశాల్లో ఈ సమాచారాన్ని పొందుపరచాల న్నారు. ఇదిలావుంటే దేశ రాజధాని ఢిల్లీ వేదికగా 'ఇండియా- ఏఐ ఇంపాక్ట్ సమిట్' ప్రారంభమైంది.20వ తేదీ వరకు కొనసాగనుంది. ప్రధాని మోదీ ఆహ్వానం మేరకు బ్రెజిల్, ఫ్రాన్స్, స్పెయిన్, స్విట్జర్లాండ్, యూఏఈ తదితర దేశాల నేతలు హాజరుకానున్నారు. 45కుపైగా దేశాల ప్రతినిధులు పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేశారు. సదస్సు వేదిక 'భారత్ మండపాన్ని' కృత్రిమ మేధ ఆధారిత నిఘా, ఆధునిక రక్షణ వ్యవస్థలతో శత్రుదుర్భేద్యంగా మార్చారు. వైమానిక దాడులను అడ్డుకునేందుకు భారత్ మండపం కాంప్లెక్స్‌లో అయిదు యాంటీ డ్రోన్ వ్యవస్థలు, నాలుగు ఎయిర్ డిఫెన్స్ గన్‌లను మోహరించారు. ఉగ్రదాడుల వంటి ఘటనలను తిప్పికొట్టేందుకు ఎన్ఎస్‌జీ సహా పలు భద్రతా సంస్థలను రంగంలోకి దించారు. మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ప్రధాని మోదీ, అంతర్జాతీయ వీవీఐపీల భద్రతా బాధ్యతలను ఎస్పీజీకి అప్పగించారు. సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, ఐటీబీపీ బృందాలు భారత మండపం పరిసరాల్లో భద్రతను పర్యవేక్షిస్తున్నాయి. ఢిల్లీ వీధుల్లో 10 వేలమందికిపైగా పోలీసులను మోహరించారు. సదస్సు జరుగుతున్న ప్రాంతాన్ని 10 జోన్‌లు, 22 సెక్టార్లుగా విభజించారు. వీటిని కమాండ్, కంట్రోల్, కమ్యూనికేషన్, ఇంటెలిజెన్స్ సిస్టమ్ ద్వారా పర్యవేక్షిస్తున్నారు. ఏఐ కెమెరాల ద్వారా రద్దీ నిర్వహణ, అనుమానాస్పద కదలికలు, గుర్తుతెలియని వస్తువుల విశ్లేషణ చేపడుతున్నారు. డిజిటల్ పాసులు, క్యూఆర్ కోడ్‌ల ద్వారానే అతిథులను లోపలికి అనుమతిస్తున్నారు. వీవీఐపీల రాకపోకల సమయంలో ట్రాఫిక్, సెక్యూరిటీ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విదేశీ అతిథుల కోసం కేంద్రం బుల్లెట్ ప్రూఫ్ కార్లను సమకూర్చింది. వారు బస చేస్తున్న హోటళ్లలో రెండు వారాల నుంచే భద్రతా ప్రొటోకాల్‌లు అమలులో ఉన్నాయి.

# జనగామ మున్సిపల్ ఎన్నికలో హైడ్రామా

మొదటి పేజీ తరువాయి



పార్టీ కూడా పీఠం దక్కించుకోవడానికి ప్రయత్నిస్తుండటంతో, స్వతంత్ర అభ్యర్థులు ఇప్పుడు కింగ్ మేకర్లుగా మారారు. ఈ నేపథ్యంలోనే కౌన్సిలర్ల మద్దతు కూడగట్టే క్రమంలో తీవ్రస్థాయిలో రాజకీయ ఎత్తుగడలు మొదలయ్యాయి. ఎన్నికకు ముందు జనగామలో కిడ్నాప్ కథనాలు కలకలం రేపాయి. తమ కౌన్సిలర్లను ప్రత్యర్థి పార్టీలు కిడ్నాప్ చేశాయని ఒక వర్గం ఆరోపించగా, పోలీసుల ఒత్తిడితో అక్రమంగా కేసులు పెడుతున్నారని మరో వర్గం నిరసన వ్యక్తం చేసింది. మున్సిపల్ కార్యాలయం వెలుపల వివిధ పార్టీల కార్యకర్తలు భారీగా గుమిగూడి నినాదాలు చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు లాఠీచార్జ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడటంతో ఆ ప్రాంతమంతా రణరంగాన్ని తలపించింది. ఎన్నిక వాయిదా పడటంపై బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా స్పందించారు. తాము విజయం సాధిస్తామనే భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులపై ఒత్తిడి తెచ్చి ఎన్నికను పోస్ట్‌పోన్ చేయించిందని మండిపడ్డారు. అధికారుల తీరు ప్రజాస్వామ్య విరుద్ధమని, కలెక్టర్ , పోలీస్ విభాగం ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాయని వారు ఆరోపించారు. ఎప్పుడు ఎన్నిక నిర్వహించినా గెలిచేది తామేనని ధీమా వ్యక్తం చేశారు. జనగామ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక వేళ హైడ్రామా నెలకొంది. 28వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ హఫీజ్ ఫాతిమాను మున్సిపల్ కార్యాలయం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఆమె కిడ్నాప్ అయ్యిందని, వారి కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆమెను అడ్డుకునేందుకు పోలీసులు యత్నించారు. విచారణ చేయాలంటూ ఫాతిమాను పోలీస్ స్టేషన్‌కు తరలించేందుకు యత్నించారు. అయితే పోలీసులను జనగామ ఎమ్మెల్యే పల్లా అడ్డుకున్నారు. ఈ క్రమంలో డీసీపీతో వాగ్వాదానికి దిగారు. కాగా, తనను ఎవరూ కిడ్నాప్ చేయలేదని ఫాతిమా స్పష్టం చేసింది. బీఆర్ఎస్ పార్టీలో గెలిచానని.. ఆ పార్టీకే మద్దతు ఇస్తానని పేర్కొన్నారు. అనంతరం కార్యాలయం లోపలికి వెళ్లిపోయారు. కాగా, జనగామ మున్సిపల్ చైర్మన్ ఎన్నికను ఆపాలంటూ కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వాగ్వాదానికి దిగారు. బీఆర్ఎస్ కౌన్సిలర్ హాఫీజ్ ఫాతిమా హాజరైనా మిస్సింగ్ కేసు నమోదైందంటూ చామల వితండవాదం చేశారు. కోరం సభ్యులు అందరూ హాజరైనందుకు ఎన్నిక ఆపడం కుదరదంటూ అధికారులు చామలకు తేల్చిచెప్పారు. నిబంధనల ప్రకారం కోరం మొత్తం హాజరైన నేపథ్యంలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను వాయిదా వేయలేమంటూ ప్రొసీడింగ్ అధికారులు తేల్చిచెప్పారు

# తొర్రూరులో ఇరు వర్గాల బాహాబాహీ

**మహబూబాబాద్:** స్పష్టమైన మెజారిటీ ఉన్న కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఎన్నిక సజావుగా సాగుతోంది. కానీ హంగ్ వచ్చిన పలు మున్సిపాలిటీల్లో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఆయా మున్సిపాలిటీల్లో పాగా వేసేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు ఎత్తులకుపైఎత్తులు వేస్తున్నారు. ఈ క్రమంలో పలు మున్సిపాలిటీల్లో ఘర్షణలు, ఆందోళనలు జరిగాయి. ముఖ్యంగా మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో ఉద్రిక్తత నెలకొంది. అక్కడ బీఆర్ఎస్‌కు మెజారిటీ వచ్చినా ఎక్స్అఫిషియో మెంబర్ల ఓట్లతో బలాలు సమానం అయ్యాయి. దాంతో ఇక్కడ డ్రా తీసి ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ను ఎంపిక చేసే అవకాశం ఉంది. ఈ క్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణులు భారీ మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని పోటాపోటీగా నినాదాలు చేశారు. ఫలితంగా పరిస్థితి ఉద్రిక్తమై రెండు వర్గాల మధ్య తోపులాట జరిగింది. ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కార్యాలయానికి చేరుకోగా.. ఎర్రబెల్లి పీఏపై కొంతమంది కాంగ్రెస్ కార్తకర్తలు దాడికి పాల్పడ్డారు. తొర్రూర్‌లో మొత్తం 16 వార్డులు ఉండగా.. బీఆర్ఎస్ 9, కాంగ్రెస్ 7 చోట్ల గెలుపొందాయి. ఇక్కడ ఎక్స్అఫీషియో ఓట్లు



కీలకంగా మారాయి. ఎక్స్అఫీషియో సభ్యులుగా ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలిద్దరూ కాంగ్రెస్ మద్దతుదారులు కావడంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ బలాబలాలు సమానంగా మారాయి. దాంతో డ్రా ద్వారా ఛైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నారు. ఇదిలావుంటే వరంగల్‌లో ఎక్స్అఫీషియో సభ్యురాలిగా కావ్య పేరు ఉందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. దీనిపై చట్టపరంగా ముందుకెళ్తామని ఆ పార్టీ చెబుతోంది. ఇదిలావుంటే బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తొర్రూరులో ఓటు హక్కు వినియోగించుకునేందకు రాగా.. అధికారులు అడ్డుకున్నారు. రాజ్యసభ సభ్యులు తమకు ఓటు ఉన్న ప్రాంతంలోనే ఓటు హక్కును వినియోగించుకోవాలని చెప్పారు. ఆయనను ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఓటు వేసేందుకు అనుమతించ లేదు. దాంతో ఆయన ఈ అంశంపై కోర్టుకు వెళ్తానని చెప్పారు. దీంతో మున్సిపల్ చైర్మేన్ ఎన్నికల వేళ తొర్రూరులో హైటెన్షన్ నెలకొంది.. కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య వాగ్వాదం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ఇరు పార్టీల శ్రేణుల వ్యతిరేక నినాదాలతో మున్సిపల్ ఆఫీసు ప్రాంగణం హోరెత్తుతోంది.భారీ జనసమీకరణకు ప్లాన్ చేసింది బీఆర్ఎస్. ఈ క్రమంలో మున్సిపల్ ఆఫీసు దగ్గర భారీగా పోలీసులు మోహరించారు. ఇరు వర్గాలు వ్యతిరేక నినాదాలు చేస్తూ పోలీసులను సైతం తోసుకుంటూ మున్సిపల్ ఆఫీసు లోపలికి వెళ్లే ప్రయత్నం చేయడంతో పరిస్థితి అదుపు తప్పనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ శబరీష్ అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. ఎవ్వరు కూడా అక్కడ ఉండకుండా వెనక్కి పంపించారు. అక్కడే ఉంటే లాఠీ చేయాల్సి వస్తుందని కాంగ్రెస్, బిఆర్ఎస్ కార్యకర్తలను హెచ్చరించారు. అలాగే అక్కడికి వచ్చిన యశశ్విని రెడ్డి అత్త ఝూన్సీరెడ్డిని కూడా ఎస్పీ వెన్నక్కి పంపించారు. ఆమె కారు దిగకుండానే వెనక్కి వెళ్లిపోయారు. ఎర్రబెల్లి దయాకర్ రావు మాత్రం మున్సిపల్ ఆఫీసుకు అనుమతించారు.

## మొదటి పేజి తరువాయి

### నేటినుంచి హైటెక్స్ వేదికగా బయో ఏషియా సదస్సు

యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసన్ ప్రొఫెసర్ ప్రొఫెసర్ బ్రూస్ ఎల్ లెవిన్, ఆమ్జెన్ చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ డాక్టర్ హోవర్డ్ వై చాంగ్ పాల్గొననున్నారు. వీరితో పాటు 50కి పైగా దేశాల నుండి సుమారు 4,000 మంది ప్రతినిధులు, శాస్త్రవేత్తలు , ఫార్మా దిగ్గజాలు ఈ వేదికపై తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు.రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో లైఫ్ సైన్సెస్ రంగానికి సంబంధించిన అనేక కీలక అంశాలతో పాటు నెక్స్ట్ జనరేషన్ బయోలాజిక్స్.. ఔషధ తయారీలో వస్తున్న నూతన మార్పులు. ఏఐ / డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్.. డేటా అనలిటిక్స్ , ఏఐ సాయంతో రోగ నిర్ధారణ, చికిత్స. తెలంగాణ రైజింగ్ 2047.. 2047 నాటికి తెలంగాణను వరల్డ్-క్లాస్ లైఫ్ సైన్సెస్ ఎకోసిస్టమ్‌గా మార్చే రోడ్‌మ్యాప్. ఆర్ / డీ (పరిశోధన).. గ్లోబల్ హెల్త్ ఇంపాక్ట్ , కొత్త వ్యాధుల చికిత్సకు అవసరమైన మౌలిక వసతులు వంటి వాటిపై చర్చాగోష్టులు నిర్వహించనున్నారు. ఈ సదస్సు ద్వారా హైదరాబాద్ నగరం ప్రపంచ లైఫ్ సైన్సెస్ మ్యాప్‌లో తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకోనుంది. లైఫ్ సైన్సెస్ రంగంలో సుమారు 9,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్, 175కి పైగా ప్రదర్శనకారులు ఈ సదస్సు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. దేశంలోనే అతిపెద్ద 'టెక్‌బయో' హబ్‌గా తెలంగాణను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ సదస్సు రూపుదిద్దుకుంది.

### కేంద్ర నిధులపై దృష్టి పెట్టండి

వైద్యారోగ్య,గిరిజన సంక్షేమ శాఖల వారీగా కేంద్రం నుంచి సుమారు 15 వేల కోట్ల రూపాయిలు రావాల్సి ఉందని, వీటిని సమీకరించుకొని రాష్ట్రంలోని పెండింగ్ పనులకు ఖర్చు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా మార్చి 2, 3 తేదీల నుండి జూన్2వ తేదీ వరకు వివిధ అభివృద్ధి పనులపై వివిధ డిపార్టుమెంట్ల వారీగా 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సిఎస్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, హెల్త్, ఎడ్యుకేషన్ విభాగాలలో ఈ ప్రణాకను సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఇటీవల గ్రామపంచాయతీ, మున్సిపల్ లోకల్ బాడీస్ ఎన్నికలు ముగిసినందున ఎన్నికైన వార్డుమెంబర్లు, సర్పంచులు, మున్సిపల్ కౌన్సలర్స్, కార్పొరేటర్స్ తదితర ప్రజాప్రతినిధులకు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై అవగాహన కల్పించేందుకు బాధ్యతతో కూడిన విధులు నిర్వర్తించేందుకు ఈ వందరోజుల కార్యాచరణ ప్రణాళిక(100 డేస్ యాక్షన్ ఎ÷-లాన్) ఉపకరిస్తుందని సిఎస్ తెలిపారు. గ్రామాల్లో,పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు, రోడ్ల మరమ్మతులు, రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని తాగునీటి ఎద్దడి లేకుండాకు తగు చర్యలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ఈ యాక్షన్ ఎ÷-లాన్ రూపొందించాలని సూచించారు. రానున్న కేబినెట్ సమావేశానికి సంబంధించిన ప్రతిపాదనలను రేపటిలోగా సమర్పించాలని సిఎస్ సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, సి.వి.ఆనంద్, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, అహ్మద్ నదీమ్, ఎన్. శ్రీధర్, యోగితారాణా, కార్యదర్శులు క్రిస్టినా చొంగ్తు, టికె శ్రీదేవి, స్టీఫెన్ రవీంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### పట్టణాల్లో కాంగ్రెస్‌కు ప్రజల భారీ మద్దతు

సుమారు 90 నుంచి 95 మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకోవడం పార్టీ బలాన్ని నిరూపిస్తోందన్నారు. కేవలం గ్రామాల్లోనే కాకుండా పట్టణ ప్రాంతాల్లో కూడా కాంగ్రెస్ అత్యంత బలంగా ఉందని ఈ ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో పట్టణ కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం చేసిన కృషికి ఇది నిదర్శనమని ఆయన కొనియాడారు. ముఖ్యంగా ఖమ్మం జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీని ఏకపక్షంగా గెలిపించిన ఓటర్లకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని వమ్ము చేయకుండా, ప్రభుత్వం మరింత బాధ్యతగా పనిచేస్తుందని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేసి, పట్టణ ప్రజల రుణం తీర్చుకుంటామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. భవిష్యత్తు ప్రణాళికల గురించి మాట్లాడుతూ, 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఇందుకోసం పారిశ్రామికీకరణ, మౌలిక వసతుల కల్పన , ఉద్యోగాల సృష్టిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. మధిర నియోజకవర్గాన్ని మోడల్ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా 'డెవలప్మెంట్ కమిటీ'ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. 'నో పాలిటిక్స్.. ఓన్లీ డెవలప్మెంట్ అనే నినాదంతో ముందుకు సాగుతామని, ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన నాయకులకు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

### కాంగ్రెస్ తీరు దుర్మార్గం

తెరలేపిందన్నారు. ప్రలోభాలతో కార్పోరేటర్లను వశపరచుకునే ప్రయత్నం చేసిందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి నీతిమాలిన పనులను ఆయన తప్పుపట్టారు. కాగా, కరీంనగర్ కార్పొరేషన్‌ను బీజేపీ దక్కించుకుంది. 34 మంది కార్పొరేటర్ల మద్దతుతో ఆ పార్టీ నేత కొలగాని శ్రీనివాస్ మేయర్‌గా ఎన్నికయ్యారు. డిప్యూటీ మేయర్‌గా కూడా అదే పార్టీకి చెందిన సునీల్‌రావు అనే వ్యక్తి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి అధికారికంగా ఈ విషయాన్ని వెల్లడించారు. మేయర్ పదవిని సాధించేందుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కీలక పాత్ర పోషించారు.

### నిజామాబాద్ మేయర్ పీఠం దక్కించుకున్న కాంగ్రెస్

ఎంఐఎం పార్టీలు ఒకటయ్యాయని మండిపడ్డారు కాళేశ్వరం, ఈ కార్ రేసింగ్ తదితర కేసుల్లో బీఆర్ఎస్ పార్టీ అధినేతలు కేసీఆర్, కేటీఆర్‌లను సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు కాపాడుతున్నారో ఈ రోజు అర్థమైందమన్నారు. ఇందూరులో బీజేపీని ఓడించడానికి అనైతిక పొత్తుకు శ్రీకారం చుట్టారంటూ వారిపై నిజామాబాద్ ఎంపీ అర్వింద్ నిప్పులు చెరిగారు. బీజేపీ ఓటమిలో కాంగ్రెస్ రంగు పూసుకుని తిరిగే పోలీసుల హస్తం కూడా ఉందని ఈ సందర్భంగా ఆరోపించారు. ఈ ఐదేళ్ల పదవి పూర్తయ్యే లోపు ఈ ఫలితాన్ని రివర్స్ చేసి చూపిస్తామని ఆయన శపథం చేశారు. అయితే ఈ మున్సిపల్ ఎన్నికల్లో నైతిక విజయం తమదేనని ప్రకటించారు. ఈ టర్మ్ అయ్యేలోపు కార్పొరేషన్‌ను బీజేపీ కైవసం చేసుకుంటుందని ఎంపీ అర్వింద్ స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో నిజామాబాద్ నగర పాలక సంస్థలో బీజేపీ 28 సీట్లు కైవసం చేసుకుంది.

ఉత్తేజిత దినపత్రిక



# రాష్ట్ర అభివృద్ధి -- సంక్షేమ భవిష్యత్తుకు బ్లూప్రింట్ లాంటి బడ్జెట్ :

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



ఎమ్మిగనూరు ఫిబ్రవరి 16 సోమవారం పట్టణంలో ఎమ్మెల్యే డాక్టర్. బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి ఎమ్మిగనూరు పట్టణంలోని ఆర్ గెస్ట్ హౌస్ నందు 2026--2027 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌పై గౌరవ ఎమ్మెల్యే డాక్టర్. బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ "ఈ బడ్జెట్ గణాంకాల పుస్తకం మాత్రమే కాదు, కోట్లాది ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే విజన్ డాక్యుమెంట్. రాష్ట్ర భవిష్యత్తుకు స్పష్టమైన దిశా, దశా చూపించే విధంగా బడ్జెట్ ప్రవేశపెట్టబడింది" అని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా వ్యవసాయం, పరిశ్రమలు, సాగునీరు, విద్య, వైద్యం, పర్యాటకం, పంచాయతీరాజ్, మహిళా సంక్షేమం వంటి రంగాల బలోపేతానికి ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రత్యేక కేటాయింపులు చేయడం అభినందనీయమన్నారు. మొత్తం రూ. 3,32,205 కోట్లతో సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా బడ్జెట్ ప్రవేశపెట్టిన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారిని మరియు ఆర్థిక శాఖ మంత్రిని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి అభినందించారు. బడ్జెట్‌లోని ముఖ్య కేటాయింపులు: వ్యవసాయ అనుబంధ రంగాలకు -- రూ. 13,598 కోట్లు పాఠశాల విద్యకు -- రూ. 32,308 కోట్లు ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్లకు -- రూ. 27,719 కోట్లు వ్యవసాయ విద్యుత్ సబ్సిడీకి రూ. 11,000 కోట్లు గృహ నిర్మాణ శాఖకు -- రూ. 6,357 కోట్లు వైద్య శాఖకు -- రూ. 19,306 కోట్లు పౌర సరఫరా శాఖకు -- రూ. 3,821 కోట్లు పురపాలక శాఖకు -- రూ. 14,538 కోట్లు

అన్నదాత సుఖీభవ పథకానికి -- రూ. 6,600 కోట్లు గత ప్రభుత్వం 12.3% వడ్డీతో అప్పులు చేయగా, కూటమి ప్రభుత్వం ఆ వడ్డీ రేటును 9%కు తగ్గించడం ఆర్థిక క్రమశిక్షణకు నిదర్శనమన్నారు. వ్యవసాయం, సాగునీరు, విద్య, వైద్య రంగాల బలోపేతంతో పాటు యువతకు ఉపాధి కల్పించే పెట్టుబడులను ఆకర్షించేలా బడ్జెట్ రూపొందించబడిందని పేర్కొన్నారు. విషన్ 2047 లక్ష్యంగా రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించే దిశగా ఈ బడ్జెట్ దోహదపడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కుర్నీ కార్పొరేషన్ చైర్మన్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్, ఏఎంసీ చైర్మన్, మండల మరియు పట్టణ కమిటీ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సిఐటియు ఆధ్వర్యంలో నిరసన ధర్నా




రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ పారిశుద్ధ్య ఇంజనీర్ కార్మికులకు ప్రస్తుత ధరలు అనుకూలంగా పిఆర్సి పెంచాలని వేతనాలు పెంచాలని రాష్ట్ర బడ్జెట్లో మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు తక్షణమే వేతనాలు పెంచాలని ఎమ్మిగనూరు మున్సిపల్ పారిశుద్ధ్య ఇంజనీరింగ్ కార్మికులు సోమప్ప సర్కిల్ నందు సిఐటియు ఆధ్వర్యంలో నిరసన ధర్నా చేశారు ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కే ఇస్మాయిల్ సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి రాముడు వీరు మాట్లాడుతూ భారత దేశవ్యాప్తంగా పారిశుధ్య ఇంజనీరింగ్ కార్మికులు 20 సంవత్సరముల నుండి పనిచేయుచున్నారని వీరికి శ్రమకు తగ్గ వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తపరిచారు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తీర్పు ఉన్నప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులను శాలువలతో సన్మానాలు చేస్తూ కాళ్లకు పూలు చల్లుతూ కార్మికుల చేత శ్రమ దోపిడీ చేసిందని విమర్శించారు కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు పారిశుద్ధ్య ఇంజనీరింగ్ కార్మికులకు రెగ్యులర్ చేస్తామని కనీస వేతనాలు ఇస్తామని ఇచ్చిన హామీలను నేటికీ అమలుపరచడం లేదని తెలిపారు ఫిబ్రవరి 14వ తేదీ ప్రవేశపెట్టిన మూడు లక్షల 32వేల కోట్ల రూపాయలు బడ్జెట్ ను ప్రవేశపెట్టగా మునిసిపల్ కార్మికుల జీ తా బత్యాలకు బడ్జెట్ కేటాయింపులు జరపకపోవడం విచారకరమన్నారు ప్రస్తుత బడ్జెట్లో మొదటి ప్రాధాన్యతగా పారిశుద్ధ్య ఇంజనీరింగ్ కార్మికులకు పిఆర్సి మరియు వేతనాలు పెంచాలని 62 సంవత్సరాలు సర్వీస్ కొనసాగించాలని 60 సంవత్సరములు ఉన్నవారికి గ్రాచిటీ పెన్షన్ ఇవ్వాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల అందరిని రెగ్యులర్ చేయాలని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు తల్లికి వందనం రేషన్ కార్డు ఇంటి స్థలాలు శాశ్వత గృహాలు తదితర సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ సమావేశాలలో వేతనాల పెంపు నిర్ణయం తీసుకోవాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిది ఎమ్మిగనూరు పట్టణంలో మునిసిపల్ కాంటాక్ట్ కార్మికులు నిరసన కార్యక్రమంలో బి కేసన్న కే చిదానంద ఉరుకుంది బడేసాబ్ రంగన్న పెద్దయ్య గోరు భాష మారేష్ ఆది అన్న రాజు చిన్న బడిసావ్ మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు

# బోడబండ పుణ్యక్షేత్రంలో నేత్రపర్వంగా రథోత్సవ వేడుకలు

**పెద్దఎత్తున హాజరై మొక్కులను తీర్చుకున్న భక్తులు.**

**భక్తులకొరకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు.**

**తుగ్గలి: ఉత్తేజిత న్యూస్:**



మండల పరిధిలోని గల ఉప్పర్లపల్లె గ్రామ సమీపంలోని గల బోడబండ పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీ పకీరప్ప గురు స్వాములు,శ్రీ యల్లప్ప గురుస్వాములు మరియు శ్రీ ఆంజనేయులు తాత వారి రథోత్సవ వేడుకలు అశేష జనవాహిని మధ్య ఆహ్లాద వాతావరణంలో నేత్రపర్వంగా సోమవారం రోజున ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉదయం శ్రీ పక్కీరప్ప స్వామి,శ్రీ యల్లప్ప స్వామి,శ్రీ ఆంజనేయులు తాత ఉత్సవమూర్తులు అప్పా నారాయణ స్వామి ఆధ్వర్యమున గంగాస్నానం నిర్వహించారు. అనంతరం పెరవలి గ్రామము గవ్వల గురునాథం,మొలగవెల్లి గ్రామ వాస్తవ్యులు శ్రీ రంగన్న తాత,శ్రీ పక్కీరప్ప తాత భక్తాదులు మరియు హైదరాబాద్ శ్రీరాములు చేత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సంధ్యావేళలో నిర్వహించిన శ్రీ పకీరప్ప గురు స్వాములు,శ్రీ యల్లప్ప గురుస్వాములు,శ్రీ ఆంజనేయులు తాత వారి రథోత్సవ వేడుకలకు భక్తులు,ప్రజలు పెద్ద ఎత్తున హాజరై మొక్కులను తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ధర్మకర్త అప్పా వేణు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్ గౌడ్, జొన్నగిరి ఎస్సై మల్లికార్జున తమ పోలీస్ సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి భీమన్న, అప్పా చంద్రశేఖర్,అప్పా నారాయణ స్వామి, నీలా ప్రసాద్,నీలా మనోహర్,సుంకప్ప, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ మాసం ఏర్పాట్లపై ముస్లిం సోదరులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి ఫిబ్రవరి 16 సోమవారం**





ఎమ్మిగనూరు మున్సిపాలిటీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్. బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి ముస్లిం సమాజ ప్రతినిధులు, మసీదు కమిటీ సభ్యులు మరియు వివిధ శాఖల అధికారులతో కలిసి రంజాన్ మాసం సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. బిఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు నిర్వహించే ముస్లిం సోదరులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రధానంగా అధికారులకు ఇచ్చిన ఆదేశాలు: మసీదుల పరిసరాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచడం ప్రార్థన సమయాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవడం చట్టం మరియు శాంతి భద్రతలను కట్టుదిట్టంగా అమలు చేయడం తాగునీరు మరియు ఇతర మౌలిక సదుపాయాలను కల్పించడం రాత్రి సమయంలో తగిన లైటింగ్ ఏర్పాట్లు చేయడంపవిత్ర రంజాన్ మాసం ప్రశాంతంగా మరియు ఆధ్యాత్మిక వాతావరణంలో జరగాలని, ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో మసీదు కమిటీ సభ్యులు, స్థానిక మైనారిటీ ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, టీడీపీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అగ్నిలో ఆహుతి అయిన ఇల్లు.. రోడ్డున పడిన పేద కుటుంబం

**ఎవరైనా సహాయం చేస్తారా అని ఎదురుచూపు**


**ఇన్నేళ్ల నుండి సంపాదించుకున్నదంతా అగ్నిలో కాలిపోతే కట్ట బట్టలతో బయటపడిన కుటుంబం**

**ఇంత నష్టం జరిగినా ప్రభుత్వం స్పందించక నాయకులు స్పందించకపోవడంతో బిక్కు బిక్కు మంటున్న దళిత కుటుంబం**

**దేవనకొండ ఫిబ్రవరి 16 ( ఉత్తేజిత)**







మండల పరిధి లో కరివేముల గ్రామంలో మాదిగ రంగనాయకులు తనకున్న సొంత స్థలంలో కొన్ని సంవత్సరాల నుండి గుడిసె వేసుకొని జీవనం సాగిస్తున్నాడు. ఆ క్రమంలో ఆదివారం అందరూ పనులకు వెళ్లిన సమయంలో రంగనాయకులు తల్లి గంగమ్మ ఇంట్లోనే ఉండి టీ కాచుకుందామని గ్యాస్ వెలిగించింది. గ్యాస్ లీకేజ్ వల్ల మంటలు చెలరేగడంతో ప్రమాదం నుంచి తప్పించుకోవడానికి బయటకు పరిగెత్తుకొచ్చింది అంతులోపే గుడిసె మొత్తం కూడా అగ్నిలో ఆహుతి అయిపోయింది. చుట్టుపక్కల ఉన్నవారు ఫైర్ ఇంజన్ కు ఫోన్ చేయగా అది వచ్చేలోపే గుడిసె పూర్తిగా దగ్ధమై బూడిదైపోయింది. ఏం చేయాలో తెలియక తల్లి నోరు కొట్టుకుంటూ రోదించింది. కుటుంబ యజమాని రంగనాయకులు మీడియాతో మాట్లాడుతూ.. తమ్ముడు పెళ్లి కోసం అని రెండు లక్షలు రూపాయలు నగదు అప్పుగా తీసుకొచ్చి ఇంట్లో పెట్టమని అలాగే తన తల్లి తన భార్యది మూడు తులాలు బంగారం, 20 తులాల వెండి, అగ్నిలో ఆహుతి అయిపోయిందని ఆహార ధాన్యాలు, వంట పరికరాలు, కట్టుకునే బట్టలు, దుప్పట్లు తన భార్యది కుట్టు మిషన్, పూర్తిగా కాలిపోయావని విలవిల కన్నీరు విడుస్తూ బాధపడ్డాడు. ఉండడానికి ఇల్లు లేక కట్టుకోవడానికి బట్టలు లేక తినడానికి ఆహారం లేక చాలా ఇబ్బంది పడుతున్నామని మా మీద దయవుంచి ప్రభుత్వం సహాయం చేయాలని అలాగే నాయకులు, మానవతావాదులు, కులాలకు మతాలకు అతీతంగా వచ్చి సహాయం చేయాలని కోరాడు.

# శ్రీ కృష్ణ దేవరాయలు 556 వ జయంతి వేడుకలు

**బేతంచేర్ల : ఉత్తేజిత ప్రతినిధి :**



ఆంధ్రబోజుడు శ్రీకృష్ణ దేవరాయలు పాలన స్వర్ణయుగమని బేతంచెర్ల బలిజ సంగీయులు అన్నారు. సోమవారం బేతంచెర్ల పాత బస్టాండ్ లోశ్రీకృష్ణదేవరాయల556 వ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ శ్రీకృష్ణదేవ రాయలు దక్షిణ భారతదేశంలో అతిపెద్ద విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించి ప్రజలకు సుపరిపాలన అందించిన గొప్ప మహానియుడని కొనియాడారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోహరి, సుబ్బారెడ్డి, నాగమోహన్,కౌశిక్,శ్రీనివాసులు, మధు కుమార్,రమేష్,హరి,నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి-11 సంఖ్య గల ఐడి కార్డు ఉంటేనే ప్రభుత్వ పథకాలు...

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**





ఎమ్మిగనూరు ఫిబ్రవరి 16 సోమవారం మండల పరిధిలోని గుడికల్ గ్రామంలో సూపర్ చెక్ రికార్డ్స్ ఈ రబీ సీజన్లో రైతులు పంటలు వేశారా లేదా అనేది పరిశీలించడం జరిగినది, ఇందులో ముఖ్యంగా సూపర్ చెక్ రికార్డ్స్ లో బాగంగా మొక్కజొన్న వేరుశనగ పంటలను పరిశీలించడం అయినది, ఎమ్మిగనూరు మండలంలో దాదాపు 2758 రైతులు పీఎం కిసాన్ పథకం తీసుకుంటూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోలేదు, కావున ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ చేసుకుంటేనే నెక్స్ట్ ఇన్స్టాల్మెంట్ అయినటువంటి పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ మరియు రాబోయే రోజుల్లో వచ్చే ఖరీఫ్ సీజన్ యూరియా మరియు ఎరువులు ఇవ్వబడతాయి, రిజిస్ట్రేషన్ చేసుకోని రైతులకు, యూరియా, ఎరువులు కూడా ఇవ్వబడవు. ఈ విశిష్ట సంఖ్య గల ఐడి కార్డు లేకపోతే రైతులకు ప్రభుత్వ పథకాలు ఏమి వర్తించవు కావున మన మండలంలో ఇంకా రిజిస్ట్రేషన్ చేసుకొని రైతులు వెంటనే మీ సమీప రైతు సేవా కేంద్రం దగ్గరకు వెళ్లి కచ్చితంగా ఈనెల 28వ తేదీ లోపల రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇందు వెంట అగ్రికల్చర్ అసిస్టెంట్ హిమబిందు మరియు పొలం గల రైతులు పాల్గొన్నారుఎం. శివ శంకర్.మండల వ్యవసాయ అధికారి, ఎమ్మిగనూరు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి

**- పేదలకు ఆర్థిక భరోసా అందిస్తున్న ప్రభుత్వం**

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**





ఎమ్మిగనూరు ఫిబ్రవరి 16 సోమవారం పట్టణంలో మున్సిపాలిటీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్. బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి ఎమ్మిగనూరు నియోజకవర్గానికి చెందిన 15 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఖీ) చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గత 18 నెలల్లో ఎమ్మిగనూరు నియోజకవర్గంలో మొత్తం 201 మంది లబ్ధిదారులకు సుమారు రూ. 1.69 కోట్లు సీఎంఆర్ఎఫ్ ద్వారా అందించబడినట్లు తెలిపారు. ఇంకా మరిన్ని అర్హులైన వారికి సహాయం అందించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఆర్థికంగా బలహీన వర్గాలకు ఆసుపత్రి చికిత్స ఖర్చులు భరించలేని పరిస్థితుల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయుక్తంగా నిలుస్తోందని, పేద ప్రజల ప్రాణాలను కాపాడే సంక్షేమ చర్యగా ప్రభుత్వం దీనిని అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్, మండల మరియు పట్టణ కమిటీ నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్

## చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే బీవీ

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**

ఎమ్మిగనూరు ఫిబ్రవరి 16 సోమవారం ఎమ్మిగనూరు శాసన సభ్యులు డాక్టర్ బి.వి జయ నాగేశ్వర్ రెడ్డి సారు చేతులు మీదుగా శతగ్రస్తులకు అందజేత ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి ఆదేశాలు మేరకు ఆనాడు మహానుభావుడు అన్నట్లు. సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు

అన్న ఆ మహనుబావుడు స్ఫూర్తితో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్న మన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబునాయుడు సార్ గారికి హృదయపూర్వక ధన్యవాదములు ఈరోజు నందవరం మండలం నందవరం ఎస్సీ కాలనీకి చెందిన జుట్ల శవాల సుందరజ్ గత సంవత్సరం క్రితం ప్రమాదవశాత్తు యాక్సిడెంట్లులో మరణించడం జరిగిందిఈరోజు సీఎం ఫౌండేషన్ రిలీఫ్ కింద అన్నగారి చిన్న కుమారునికి చెక్కు ఇవ్వడం జరిగిందిఅన్నగారు కుమారుడు తన కృతజ్ఞతంగా ఎమ్మిగనూరు డైనమిక్ స్పీకర్ మరియు శాసనసభ్యులు. డాక్టర్ బి వి జగనేశ్వర్ రెడ్డి సార్ గారికి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలపడం జరిగింది ఇది మన ప్రభుత్వం మంచి ప్రభుత్వం జై తెలుగుదేశం జై జై తెలుగుదేశం



ఉత్తేజిత దినపత్రిక

## ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు ఎక్కడ వైఎస్ జగన్.....!

- రాయలసీమ ఉద్యాన హబ్ కు రూ..30 వేల కోట్లు

- రాష్ట్ర ప్రజలకు బడ్జెట్ ఆమోద యోగ్యమైనది

- విలేకరులతో మాట్లాడుతున్న గిత్త జయసూర్య

నందికొట్కూర్ ఉత్తేజిత ప్రతినిధి ఫిబ్రవరి 16-




: రాయలసీమ ఉద్యాన హబ్ కు బడ్జెట్ లో రూ.30 వేల కోట్ల ను రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కేటాయించడం పట్ల రాయలసీమ ప్రజాప్రతినిధులు హర్షించదగ్గ విషయమని నందికొట్కూరు శాసనసభ సభ్యుడు గిత్త జయసూర్య అన్నారు. సోమవారం స్థానిక పీ-4కార్యాలయంలో ఎమ్మెల్యే పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రూ.3,32,205 కోట్లతో ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో తీసుకెళ్లడంతో పాటు సంక్షేమాన్ని పరుగులు పెట్టించేలా ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం హాయంలో రాష్ట్రంలో ఎంతో నష్టం జరిగిందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి దిశగా అడుగులు ముందుకు వేస్తుందని తెలిపారు. గత 2019-24 లో జగన్ మోహన్ రెడ్డి రాయలసీమకు ఏ ఒక్క పైసా కూడా కేటాయించలేదన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు గత ఐదు సంవత్సరాల్లో ఎక్కడికి వెళ్లాయో నేటి వరకు చెప్పలేని పరిస్థితుల్లో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉన్నారని ఎద్దేవా చేశారు . ఎస్సీల సంక్షేమం కోసం బడ్జెట్ లో రాష్ట్రంలోని పేద బడుగు బలహీన వర్గాల వారికి బడ్జెట్ ఆమోద పాత్రికేయులతో మాట్లాడుతున్న యోగమైందన్నారు .పేదవారి సొంత ఇంటి కల నెరవేర్చాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. గత ఏడాది బడ్జెట్లో రూ.2 వేల కోట్లు కేటాయిస్తే ఈ ఏడాది రూ.6,357 కోట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు గుంజు పల్లె భాస్కర్ రెడ్డి, పగిద్యాల టిడిపి మండల కన్వీనర్ పలుచాని మహేశ్వర రెడ్డి, టిడిపి నాయకులు లాయర్ జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలంలో ఎక్సైజ్ శాఖ కీలక పాత్రకు ప్రశంస పత్రం

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు ఫిబ్రవరి 16:**



శ్రీశైలం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు సంధర్భంగా శ్రీశైలం దేవస్థాన పరిధిలోకి నాటుసారా, మద్యము, గంజాయి తదితర నిషేధిత మత్తుపదార్థాలు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనీయా ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి ఎస్.రవికుమార్ నంద్యాల అసిస్టెంట్ ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి.రాముడు సారథ్యంలో (07) మంది సి.ఐలు (05) మంది ఎస్.ఐలు మరియు (50) మంది సిబ్బందితో సున్నిపెంట, సుగాలి కాలనీ, లింగాలగట్టు, శిఖరం, హాటకేశ్వరం, కైలాశద్వారం, మేకలబండ, వద్దేగేరి, కొత్తపేట, మాణిక్యమ్మశెల ఇలా పలుచోట్ల సిబ్బంది సహాయంతో చక్కటి బందోబస్తు ఏర్పాటు చేసి పలు కేసులు నమోదు చేయడంలో కీలకపాత్ర పోషించిన 19 మంది సిబ్బందికి ప్రశంసా పత్రాన్ని నంద్యాల జిల్లా ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి ఎస్.రవికుమార్ ఆదేశాలలో భాగంగా నందికొట్కూరు ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ నుంచి శేఖరయ్యా నాయకుడు (హెడ్ కానిస్టేబుల్) సుధీర్ కుమార్, మధు ప్రసాద్, రమిజాబీ(కానిస్టేబుళ్లు) వీరికి ప్రశంషిస్తూ ప్రశంసా పత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల అసిస్టెంట్ ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి.రాముడు, నందికొట్కూరు సి.ఐ రామాంజనేయులు మరియు ఇతర సి.ఐలు ఎస్.ఐలు తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గుల శ్రీనివాసులకు నివాళులర్పించిన

:ఎమ్మెల్యే గిత్త జయసూర్య

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు ఫిబ్రవరి 16:**



నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామంకు చెందిన గొల్ల చెన్నరాయుడు కుమారుడు బొగ్గుల శ్రీనివాసులు ఖమ్మం జిల్లా, కూసుమంచి మండలం, పాలేరు గ్రామంలోని జలాశయం నందు అనుమానస్పద మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న నందికొట్కూరు నియోజకవర్గం ఎమ్మెల్యే గిత్త జయసూర్య , వారి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించడం జరిగినది.ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిన్న నాగలక్ష్మయ్య, సున్నంపల్లి శ్రీనివాసులు, తిరుపతయ్య, సాంబశివుడు, పెద్దరాజు, మని, తిరుపాలు, మహేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ శ్రీ శ్రీ కాశీ చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవం

: గ్రామ సర్పంచ్ రవి యాదవ్, కమిటీ ఆధ్వర్యంలో

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు ఫిబ్రవరి 16 :**



నందికొట్కూరు మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలో వెలసిన మ శ్రీ శ్రీ శ్రీ కాశీ చంద్రమౌళీశ్వర స్వామి తిరుణాల మహోత్సవ మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం శ్రీ హైమావతి కాశి చంద్రమౌళీశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. సోమవారం చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవానికి ముఖ్య అతిథులుగా నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జై సూర్య బిజినవేముల గ్రామ సర్పంచ్ రవి యాదవ్ లు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్త జయ సూర్య మాట్లాడుతూ బోలా శంకరుని విశిష్ట అవతారంలలో అత్యంత కీలకమైనది భక్తుల శ్రేయస్సును కోరే శ్రీశ్రీ కాశి చంద్రమౌళీశ్వర స్వామి భక్తులు నిష్టతో కోర్కెలు కోరిన వెంటనే నెరవేర్చే దేవదేవుడు చంద్రమౌళీశ్వర స్వామి అని అన్నారు. బిజినవేముల గ్రామ ప్రజలకు చేదోడువాదోడుగా ఉండే గ్రామ సర్పంచిని గ్రామ ప్రజలను గ్రామ రైతుల పాడిపంటలను సమృద్ధిగా ప్రసాదించేది చంద్రమౌళీశ్వర స్వామి అని అన్నారు. అనంతరం గ్రామ సర్పంచ్ రవి యాదవ్ మాట్లాడుతూ సోమవారం గుండు సంద, పోటీ మంగళవారం కోలన్న ఆటలు, జానపద గేయ కార్యక్రమాలు బుధవారం డాన్స్ బేబీ డాన్స్ చిన్నపిల్లల కార్యక్రమం దాతల సహకారంతో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ముందుగా ఎమ్మెల్యే గిత్త జయ సూర్యను గ్రామ సర్పంచ్ ఘనంగా స్వాగతించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి గ్రామ టిడిపి నాయకులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# పక్కా నీటి ప్రణాళికలే మేలు !



పోలవరం సహా అనేక ప్రాజెక్టులు ఇంకా పూర్తికాలేదు. పోలవరం పన్నెండేళ్లుగా నానుతోంది. నాలుగైదే ళ్లలో పూర్తి చేయాల్సిన ప్రాజెక్ట్ ఇంకా పూర్తి కాలేదు. ఏయేటి కాయేడు నిర్మాణ ఖర్చు తడిసి మోపెడు అవుతోంది. రాయలసీమతో సహా అనేక ప్రాజెక్టులు పూర్తి కావాల్సి ఉంది. వాటి గురించి పట్టించుకోకుండా కొత్తగా నల్లమలసాగర్ పేరుతో చంద్రబాబు ఇరు రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టడం వెనక పెద్ద వ్యూహం ఉండివుంటుంది. తెలంగాణలో కూడా కాళేశ్వరంను తిడుతూ రెండేళ్లుగా కాలయాపన చేస్తూ వస్తున్నారు. ఎన్నికల్లో గెలవడంతో తమకు ప్రజల మద్దతు ఉందని చెప్పుకోవడం ద్వారా ప్రజల దృష్టిని మరల్చలేరు. ఇక్కడా అనేక ప్రాజెక్టులు పూర్తి కావాల్సి ఉంది. వాటిని పూర్తి చేసేందుకు రేవంత్ ప్రభుత్వం సంకల్పం ప్రకటించాలి. అంతే తప్ప ఎంతసేపు ఎన్నికలు, ఫలితాలు వంటివాటితో పొంగిపోరాదు. నీటిని వాడుకోవడం ఎలా అన్న దానిపై ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు కసరత్తు చేయాలి. వ్యవసాయరంగంలో విప్లవం సాధించా లంటే నీటి యాజమాన్యం కూడా ముఖ్యం. ఇకపోతే రెండేళ్ల యినా చేయాల్సిన పనులు చేయకుండా ఎంతసేపు జగన్‌ను ఆడిపోసుకోవడంతోనే కలం గడిపేస్తున్నారు. అలాగే 2027 జూన్ కంటే ముందే పోలవరం జాతికి అంకితం చేస్తామన్నది తొలి కార్యాచరణ కావాలి. ఆ ప్రాజెక్టు పూర్తి చేశాక నదుల అనుసంధానం చేపడతా మని, పోలవరం నుంచి నీటిని నల్లమల సాగర్‌కు తీసుకెళ్తామని పేర్కొన్నారు. పెండింగ్ ప్రాజెక్టులపై ప్రాధాన్యత ఇవ్వకుండా లేని ప్రాజెక్టుతో వివదాలు సృష్టించడం, కేంద్రంపై ఒత్తిడి తేవడం వంటివన్నీ అనవసర విన్యాసాలు తప్ప మరోటికాదు. ఇరు రాష్ట్రాల మధ్య సయోధ్యతో ముందుకు సాగాల్సిన అసవరం ఉంది. ఒకప్పుడు తాను ఉమ్మడి ఎపికి సిఎంగా చేశానని గుర్తించి చంద్రబాబు నడవాల్సి ఉంది. అంతేగాక వివాదాస్పదంగావున్న నల్లమల సాగర్ మాట ఇప్పుడు చెప్పడం ద్వారా తెలుగు రాష్ట్రాల మధ్య సఖ్యత, సౌభ్రాతృత్వానికి ఇబ్బందులు తెచ్చుకోవడమే అవుతుంది. అంతేగాక తక్కువ ఖర్చుతో సత్వర ఫలితాలి చ్చే పెండింగ్ ప్రాజెక్టుల్ని పూర్తి చేయడం అవసరం. కానీ అలా జరగడం లేదు. ఇకపోతే ఙాష్ట్రంలో నీటి వినియోగానికి సంబంధించి కొత్త పాలసీ తీసుకువస్తున్నట్టు కథనాలొచ్చాయి. ప్రస్తుతం విద్యుత్ రంగంలో అమల్లో ఉన్న రెగ్యులేటరీ కమిషన్‌లా నీటి వినియోగానికి కూడా ఒక కమిషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కూడా వచ్చింది. గతంలోనే ప్రపంచబ్యాంకు సాగు నీటికి రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేయాలని ఆదేశించడం, అందులో భాగంగా సాగునీటి మీటర్ల ఏర్పాటుకు ఆనాటి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం విఫలయత్నం చేసిన విషయాలు ప్రజల స్మృతి పథం నుండి ఇంకా తొలగిపోలేదు. మళ్లీ అలాంటి ప్రయత్నం చేయడం అన్నదాతలతో సర్కారు కయ్యం తెచ్చుకోవడమే అవుతుంది. నీటి సరఫరాకు చేస్తున్న ఖర్చుకు తగ్గట్టుగా ప్రజల నుండి వసూలు చేసే పన్నులు ఉండేలా చూడటం కూడా పాలసీలో భాగమంటు న్నారు. యూజర్ ఛార్జీలు వసూలు చేయకపోతే భవిష్యత్ నిర్వహణ కష్టం అవుతుందని తొలుత పరిశ్రమల తో ప్రారంభించి, ఆ తరువాత అందరికీ దీనిని విస్తరించే అవకాశం ఉందని సమాచారం. అంతకన్నా ముఖ్యం గా నీటి వినియోగ ప్రాధాన్యతల్లోనూ సర్కారు మార్పులు చేయబోతున్నదని వస్తున్న వార్తలు ఆందోళన కరం. ప్రతి ఎకరాకు సాగునీరందేలా సాగునీటి సంఘాలు కృషి చేయాలని అమరావతిలో నిర్వహించిన నీరు-ప్రగతి, జలహారతి సాగునీటి సంఘాల భాగస్వామ్యం కార్యక్రమంలో సిఎం చంద్రబాబు సూచించడం మంచిదే! అలాగే ఈ ఏడాది నుంచి ఖరీఫ్ సాగును ముందస్తుగా ప్రారంభించాలని తుపానుల వల్ల పంటలు దెబ్బతినకుండా రైతులను సన్నద్ధం చేయాలని, కాల్వలకు మే 15 కల్లా నీటిని విడుదల చేయాలని అధికారులను ఆదేశించడం స్వాగతించదగినది. 'వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మార్చుకోవాలని, పరిగెత్తే నీటిని నడిపించాలి, నడిచే నీటిని నిలబెట్టాలి, నిలిచిన నీటిని భూగర్భ జలాలుగా మార్చి భూమినే జలాశయంగా మార్చాలి?' అని చెప్పడం బాగానే వుంది. రాష్ట్రంలో గోదావరి, కృష్ణా, పెన్నా, వంశధార, నాగావళి వంటి 40 నదులు, 38 వేల చెరువులు ఉన్నాయని, వీటన్నిటిలో 1,300 టిఎంసిలకు పైగా నీటిని నిల్వ చేసుకోగలమనీ, ఈ ఏడాది 862 టిఎంసిల నీళ్లు మన జలాశయాల్లో నిల్వ ఉన్నాయని వాస్తవాలు వివరించారు. వరిసాగు తగ్గించి ఎక్కువ మంది రైతులు ఉద్యాన పంటలు, తృణ ధాన్యాల వైపు దృష్టి సారించాలనడం పంటల సరళిని ఏకపక్షంగా మార్చడం మంచిదే అయినా భూములు, నీటి అనుకూలత వంటి విషయలను రైతులతో చర్చిస్తే మంచిది. పంటల సరళిలో మార్పు ఎంతో ప్రణాళికాబద్ధంగా జరగాలే తప్ప హడావుడిగా చేయరాదు. ఆయా పంటల సాగుకు భూసార అనుకూలతలు, నీటిపారుదల సౌకర్యాల లభ్యత లేదా కొరత, పంటల ఉత్పత్తుల వినియోగం, నిల్వ అవకాశాలు, మార్కెట్ పరిస్థితులు వగైరా అనేక అంశాలను శాస్త్రీయంగా అధ్యయనం చేశాకనే నిర్దారించుకొని, అవసరమైన ప్రోత్సాహకాలిచ్చి అన్నదాత లను అటువైపు మళ్లించవలసి వుంటుంది. కానీ ఆ తరహా ఆలోచనలు, తగిన సన్నాహాలు చేయకుండా ఇటువంటి సలహాలివ్వడం రాష్ట్రానికి శ్రేయస్కరం కాదు. ఇప్పటికే ప్రభుత్వం పంటలకంటే పరిశ్రమలకు, జెన్‌కో అధ్వర్యంలోని జల విద్యుత్ కన్నా కార్పొరేట్లు తెస్తున్న పంప్డ్ హైడ్రో ప్రాజెక్టులకూ మొగ్గు చూపుతున్న వైనం ద్యోతకమవుతోంది. ఈ నేపథ్యంలో కొత్తగా తెచ్చే జల విధానం పై ఎవరికైనా సందేహాలు కలగడం సహజం. ఏదిఏమైనా అంతర్జాతీయ జల సూత్రాల ప్రకారం ప్రజలకు తాగు నీరు, పంటలకు సాగు నీరు, జల విద్యుత్, ఆ తరువాతనే పరిశ్రమలు, ఇతర అవసరాలనే ప్రాధాన్యత క్రమానికి లోబడి ప్రభుత్వం వ్యవహరించడం సబబుగా ఉంటుంది. ఉన్ననీటి వనరులను వాడుకోవడం, అసవరమైన పంటలను పండించడం, రైతులకు లాభాలు చేకూర్చడం అన్నది ఓ ప్రణాళికా బద్దంగా సాగాల్సిన విషయం. ఇందుకు ప్రణాళికలు రచించి ముందుకు సాగితే మంచిది. అది వ్యవసాయపరంగా విప్లవాత్మకంగా మారుతుందనడంలో సందేహం లేదు.

# రష్యా నిర్ణయంపైనే బంగారం ధరలు



### డాలర్‌తో వాణిజ్యం కొనసాగితే తగ్గనున్న పసిడి

### అంతర్జాతీయ నిపుణుల వెల్లడి

న్యూఢిలీ:అంతర్జాతీయ పరిస్థితులు బంగారాన్ని కంట్రోల్ చేస్తున్నాయి. రష్యా రూబుల్‌తో వ్యాపారం కారణంగా పరిస్థతి దిగజారిందని అంటున్నరు. తిరిగి రష్యా డాలర్‌తో వ్యఆరాన్ని పునరుద్దరిస్తేనే బంగారం రేట్లు దిగి వస్తాయని అంటున్నారు. బంగారం అంటే ఇష్టపడేవారికి పండగలాంటి అంచనాను నిపుణులు వెలువరించారు. ఇప్పుడు 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.లక్షన్నర పైగా ఉండగా, ఇది రూ.లక్ష లోపునకు రావచ్చని.. అంతర్జాతీయ విపణిలో ఔన్సు బంగారం ధర 5,000 డాలర్ల వద్ద కదలాడుతుండగా, 3,000 డాలర్లకు దిగిరావచ్చని అంచనా వేస్తున్నారు. రష్యా కనుక అమెరికా డాలర్లలో వాణిజ్యాన్ని పునఃప్రారంభించినప్పుడే, ఇది జరుగుతుందని పేర్కొంటున్నారు. అంతర్జాతీయ విపణికి అనుగుణంగా దేశంలో గతేడాది బంగారం, వెండి ధరలు శరవేగంగా దూసుకెళ్లాయి. ఏడాది వ్యవధిలోనే బంగారం ధర 70 శాతానికి పైగా పెరిగి, గత నెలలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1.80 లక్షలకు మించి గరిష్ఠస్థాయిని తాకినా, ప్రస్తుతం రూ.1.59 లక్షల వద్ద ఉంది. అంతర్జాతీయంగానూ ఔన్సు బంగారం ధర 5600 డాలర్లపైకి వెళ్లినా, మళ్లీ ఇప్పుడు 5000 డాలర్ల దగ్గర ట్రేడ్ అవుతోంది. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభించాక, అంతర్జాతీయ అనిశ్చితులు పెరగడంతో, సురక్షితమని భావిస్తూ బంగారంపైకి పెట్టుబడులు వెల్లువెత్తుతుండటమే ధరల వృద్ధికి కారణం. ఆ రెండు దేశాల మధ్య శాంతి చేకూర్చాలని, వచ్చే జూన్ కల్లా యుద్ధాన్ని నిలిపివేయాలనే లక్ష్యంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉన్నారు. ఇప్పటికే రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఆయన సంప్రదింపులు జరిపారు. రష్యా చమురు కొనకుండా, భారత్ సహా పలు దేశాలపై భారీ సుంకాలు విధించడంతో, రష్యా కూడా దారికి వస్తున్న సూచనలున్నాయి. అమెరికాతో వాణిజ్య సంబంధాలు పునరుద్ధరించుకునేందుకు, అమెరికా డాలర్లలో వాణిజ్యం నిర్వహించేందుకు రష్యా సన్నాహాలు చేస్తున్నట్లు వార్తా ఏజెన్సీ బ్లూమ్‌బర్గ్ తెలిపింది. డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీలు తేవాలన్న బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా) దేశాల సన్నాహాలకు ఇది పెద్ద ఎదురుదెబ్బే. రష్యా కనుక అంతర్జాతీయ వాణిజ్య సెటిల్‌మెంట్లను డాలర్లలో నిర్వహిస్తే, అమెరికా కరెన్సీకి ఊపొస్తుంది. పసిడిపై పెట్టుబడులు మళ్లీ డాలర్‌కు చేరతాయి. అప్పుడు కేంద్రబ్యాంకులూ బంగారం కొనడం ఆపేస్తాయి.

అంతర్జాతీయ పసిడి నిల్వల్లో 20? బ్రిక్స్ దేశాల వద్దే ఉన్నాయని అంచనా. బ్రిక్స్ దేశాలతో అనుబంధం ఉన్న దేశాల నుంచే, అంతర్జాతీయ పసిడి ఉత్పత్తిలో 50? వాటా ఉంది. ఇప్పుడీ దేశాలన్నీ బంగారాన్ని ఉత్పత్తి చేస్తున్నా, అతి తక్కువగా మాత్రమే విక్రయిస్తున్నాయి. ధరలు పెరిగేందుకు ఇదీ కారణమైంది. ఇప్పుడు మళ్లీ డాలర్‌కు మద్దతు పెరిగితే, అమెరికా బాండ్లకు గిరాకీ వస్తుంది. అందువల్ల బంగారంపై పెట్టుబడులు ఉపసంహరించడం ప్రారంభిస్తే ఔన్సు ధర 2027 ఆఖరుకు 3,000 డాలర్లకు దిగిరావ్చని సెబీ నమోదిత మార్కెట్ నిపుణులు అనుజ్ గుప్తా, అమిత్ గోయల్ వంటివారు పేర్కొంటున్నారు. ఇదే జరిగితే దేశీయంగా 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.90,000-1,00,000 వద్ద స్థిరపడొచ్చని అంచనా వేస్తున్నారు.


ఉత్తేజిత దినపత్రిక


# ఉగ్రదాడులకు కాంగ్రెస్ జవాబివ్వలేదు

**మోదీ ప్రభుత్వం వాళ్ల ఇంటికెళ్లి కొట్టింది**

**కేంద్ర హోంమంత్రి అమిత్ షా విమర్శలు**

న్యూఢిల్లీ: కేంద్ర హోమంత్రి అమిత్? షా శనివారం కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్? పాలనలో ఉగ్రదాడులకు సరైన సమాధానం దొరకలేదని, మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత సర్జికల్? స్ట్రైక్స్?, ఆపరేషన్? సిందూర్?తో ఉగ్రవాదులకు గట్టి సమాధానం చెప్పిందని? వ్యాఖ్యానించారు. 2019 ఫిబ్రవరి 14 జరిగిన పుల్వామా ఉగ్రదాడిని ఉటంకిస్తూ, ప్రతీకారం తీర్చుకునే కొత్త సంప్రదాయానికి మోదీ శ్రీకారం చుట్టారని షా పేర్కొన్నారు. యూపీఏ పాలనలో పాకిస్థాన్?? ఉగ్రవాదులు, భారత సైనికులపై తీవ్ర స్థాయిలో దాడులు జరిపారని ఆరోపించారు. కానీ మోదీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మన సైనికులు, శత్రువుల భూభాగంలోకి చొచ్చుకెళ్లి ఉగ్రవాదులను అంతమొందించారని చెప్పారు. కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలోని కారైకల్‌లో జరిగిన బీజేపీ బహిరంగ సభలో అమిత్ షా ఈ మేరకు వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పుల్వామా ఉగ్రదాడిలో మరణించిన 40 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లకు నివాళు లర్పించారు. పుల్వామా ఉగ్ర దాడిలో ప్రాణాలు అర్పించిన సైనికులకు నివాళు లు అర్పిస్తున్నాను. కాంగ్రెస్ పాలనలో, పాకిస్థాన్ ఉగ్రవాదులు ప్రతిరోజూ మన సైనికులపై దాడి చేసేవారు. దీనిపై దేశ ప్రధానమంత్రి, హోంమంత్రి లేదా రక్షణ మంత్రి నుంచి ఎటువంటి స్పందన ఉండేది కాదు. కానీ పుల్వామా దాడికి ప్రతీకారంగా మోదీ ప్రభుత్వం వైమానిక దాడులు చేసింది. పాకిస్థాన్ గగనతలంలోకి ప్రవేశించి, ఉగ్రవాద స్థావరాలను మట్టికరిపించింది. ప్రధాని మోదీ హయాంలో మొదట సర్జికల్ స్ట్రైక్, ఆపరేషన్ సిందూర్?తో పాకిస్థాన్‌కు గట్టి సమాధానం ఇచ్చిందని అన్నారు. మరోవైపు, పుదుచ్చేరిలోని బీజేపీ బహిరంగ సభలో పాల్గొన్న అమిత్? షా ఆ ప్రాంత అభివృద్ధి గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల ముందుకు రావడానికి రెండు లక్ష్యాలు ఉన్నాయని? షా పేర్కొన్నారు. అందులో మొదటిది మోదీ, రంగ స్వామి నాయకత్వంలోని డబుల్ ఇంజిన్ సర్కార్? సాధించిన విజయాలను ప్రజల ముందు ఉంచడానికని, రెండోది అవినీతి శక్తులకు



ప్రాతినిధ్యం వహిస్తున్న ఖూూ - ×చీణ× కూటమిల ముసుగును బయటపెట్టడానికని షా వ్యాఖ్యానించారు. ఐదు సంవత్సరాల క్రితం, పుదుచ్చేరి ప్రజలు ప్రధాని మోదీ, రంగస్వామి నాయకత్వంలో ఇక్కడ ఎన్?డీఏ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. భారత్?ను సుసంపన్నంగా, సురక్షితంగా మార్చడానికి ప్రధాని మోదీ కృషి చేశారు. పుదుచ్చేరి ప్రజలు ఎన్?డీఏ, బీజేపీ, రంగస్వామి, ప్రధాని మోదీపై తమ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో, పుదుచ్చేరి ప్రజలు 44% ఓట్లను గెలుచుకుంది. కానీ ఈసారి బీజేపీ, ఎఐఎన్?ఆర్?సీ, ఎఐఎడీఎంకే కూటమి 60% ఓట్లతో సీట్లను గెలుచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే పుదుచ్చేరిలో ఎన్?డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రధానంగా మూడు పనులు చేసింది. అందులో మొదటిది అవినీతిని అంతం చేయడం, రెండోది పుదుచ్చేరిని స్వయంప్రతిపత్తి కలిగిన కేంద్రపాలిత ప్రాంతంగా మార్చడం, మూడోది పుదుచ్చేరికి రాజకీయ స్థిరత్వాన్ని తీసుకురావడం వంటి పనులు చేసింది." అని అమిత్? షా పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, 2019 ఫిబ్రవరి 14న జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా ప్రాంతంలో సీఆర్పీఎఫ్ జవాన్లపై జరిగిన ఉగ్రదాడిని ప్రధాని మోదీ గుర్తుచేసుకున్నారు. జవాన్ల ప్రాణ త్యాగాన్ని భారత్ ఎన్నటికీ మరిచిపోదన్నారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి తమ ప్రాణాలు సైతం పణంగా పెట్టే మన భద్రతా దళాలకు దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుందన్నారు. ఉగ్రవాదం మానవాళికి అతిపెద్ద శత్రువని, దానిని పూర్తిగా నిర్మూలించేందుకు భారత్ కట్టుబడి ఉందని మోదీ పేర్కొన్నారు.

# అధికార మార్పు జరగాలి



**ఇరాన్‌లో అధికార మార్పు జరిగితే ఉత్తమం**

**చర్చలు విజయవంతమౌతాయని అనుకుంటున్నా**

**ఇరాన్‌లో సైనిక చర్యపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ: ఇరాన్‌పై సైనిక చర్యకు సంబంధించిన ఆలోచనలు కొనసాగుతున్న వేళ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లో అధికార మార్పు జరిగితే అది ఉత్తమ పరిణామం అవుతుందని అన్నారు. ట్రంప్ ప్రభుత్వం మధ్యప్రాచ్యానికి రెండో విమాన వాహక నౌకను పంపిస్తున్నట్లు ప్రకటించిన కొద్ది గటంలకే ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఇరాన్‌లో అధికార మార్పు జరిగితే అదే ఉత్తమం. 47 ఏళ్లుగా వారు మాట్లాడుతూనే ఉన్నారు. చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికే అపార శక్తి అక్కడికి చేరుకుంది. మరిన్ని బలగాలు కూడా వెళ్తున్నాయి. దీనిని ఒకేసారి పూర్తిగా ముగిస్తే మంచిదే. ఇరాన్‌పై తన ప్రధాన లక్ష్యం అణు కార్యక్రమాన్ని నియంత్రించడమే అయినప్పటికీ, అది మాత్రమే కాకుండా ఇతర అంశాలు కూడా కీలకం. చర్చలు విజయవంతం అవుతాయని అనుకుంటున్నా. విఫలమైతే అది ఇరాన్‌కు చాలా చెడు రోజు అవుతుంది' అని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ తన అణు కార్యక్రమంపై తమతో ఒప్పందం కుదుర్చుకోవాలని ఒత్తిడి పెంచుతూ, ట్రంప్ ప్రభుత్వం మధ్యప్రాచ్యానికి రెండో విమాన వాహక నౌకను పంపాలని నిర్ణయించింది. ప్రపంచంలోనే అతిపెద్ద యుద్ధనౌకగా పేరుగాంచిన యూఎస్?ఎస్? జెరాల్డ్ ఆర్. ఫోర్డ్ ప్రస్తుతం కరేబియన్ సముద్రం నుంచి పశ్చిమాసియా దిశగా బయలుదేరుతోంది. గతంలో వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను బంధించిన ఆపరేషన్‌లో కూడా యూఎస్?ఎస్ జెరాల్డ్ ఆర్. ఫోర్డ్ కీలక పాత్ర పోషించింది. ఇప్పటికే మధ్య ప్రాచ్యంలో ఉన్న యూఎస్?ఎస్ అబ్రహం లింకన్ నౌకతో పాటు, ఇప్పుడు 'ఫోర్డ్' కూడా చేరనుంది. ఒకవేళ ఒప్పందం కుదరకపోతే, యుద్ధనౌక యూఎస్?ఎస్ జెరాల్డ్ ఆర్. ఫోర్డ్ అవసరం అవుతుందని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం తర్వాత ఇప్పటికే అస్థిరంగా ఉన్న మధ్యప్రాచ్యంలో, ఈ పరిణామం మరో ప్రాంతీయ యుద్ధానికి దారితీయవచ్చని గల్ఫ్ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. గత వారం ఒమన్, ఖతార్ దేశాల మధ్యవర్తిత్వంతో ఇరాన్‌తో చర్చలు జరుగుతాయని అమెరికా భావించినప్పటికీ, అవి ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. దీంతో సైనిక ఒత్తిడిని పెంచాలని భావిస్తోంది. ఇదే సమయంలో దేశవ్యాప్త నిరసనలపై ఇరాన్ ప్రభుత్వం తీసుకున్న కఠిన చర్యల వల్ల అంతర్గత ఒత్తిడి పెరుగుతోంది. మృతుల కోసం 40వ రోజు సంతాప కార్యక్రమాలు నిర్వహిస్తున్న కుటుంబాలు ప్రభుత్వ వ్యతిరేక నిరసనలను మరింత పెంచుతున్నాయి. యూఎస్?ఎస్ ఫోర్డ్ ఇప్పటికే ఎనిమిది నెలలుగా సముద్రంలోనే ఉందని అమెరికా నేవీ టాఫ్ అధికారి అడ్మిరల్ డారిల్ కాడిల్ తెలిపారు. సాధారణంగా యుద్ధ నౌకలు ఆరు లేదు ఏడు నెలలు మాత్రమే మెహరించబడతాయని చెప్పారు. అయితే వాటి ?పొడిగింపు సిబ్బంది జీవితాలపై ప్రభావం చూపుతుందని అన్నారు. కుటుంబ కార్యక్రమాలు, వివాహాలు, పిల్లల జననాలు కూడా దెబ్బతింటాయని పేర్కొన్నారు. దీంతో నౌక మరమ్మతులు, నిర్వహణ షెడ్యూల్ కూడా దెబ్బతినే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. 2015లో కుదిరిన అణు ఒప్పందం నుంచి 2018లో అమెరికా తప్పుకోవడంతో పరిస్థితులు మరింత క్లిష్టమయ్యాయి. అప్పటి నుంచి ఇరాన్ అధిక స్థాయిలో యురేనియం సమృద్ధి చేయడం ప్రపంచ దేశాలకు ఆందోళన కలిగిస్తోంది. ఆంక్షల కారణంగా ఇరాన్ ఆర్థిక వ్యవస్థ కూడా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఆంక్షల ఎత్తివేతను చర్చల్లో కీలక అంశంగా టెహ్రాన్ భావిస్తోంది. మరోవైపు ఇరాన్ మాత్రం తన అణు కార్యక్రమం పూర్తిగా శాంతియుత ప్రయోజనాల కోసమేనని చెబుతోంది. అయితే గతంలో 60 శాతం వరకు యురేనియం శుద్ధి చేయడం అంతర్జాతీయ ఆందోళనకు కారణమైంది.

# దేశ భద్రతను కాంగ్రెస్ ప్రమాదంలో పడేస్తుంది

**ఈశాన్య ప్రాంతాన్ని అష్టలక్ష్మిగా పరిగణిస్తున్నాం!**

**అసోంకు కీలకం కానున్న రాబోయే ఐదేళ్లు**

**ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు**



న్యూఢిల్లీ: కాంగ్రెస్ ఎల్లప్పుడూ దేశ భద్రతను ప్రమాదంలో పడేస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. దేశాన్ని ముక్కలు చేయాలని కలలు కనేవారిని, ఈశాన్య ప్రాంతాన్ని భారత్ నుంచి వేరు చేయాలని నినాదాలు చేసేవారిని హస్తం పార్టీ సమర్థిస్తుందని విమర్శించారు. దేశాన్ని విభజించాలనుకునేవారే కాంగ్రెస్ ఆరాధకులుగా మారుతారని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ముస్లిం లీగ్ దేశాన్ని విభజించిందని, ఇప్పుడు నేటి కాంగ్రెస్ 'ముస్లిం లీగ్ మావోయిస్టు కాంగ్రెస్'గా మారిందని దుయ్యబట్టారు. అందుకే కాంగ్రెస్ పట్ల అసోం ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అసోంలోని గువాహటిలో జరిగిన ర్యాలీలో ఈ మేరకు మోదీ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అసోం ఆకలితో అలమటించిందని ప్రధాని మోదీ ఆరోపించారు. అలాగే భయం గుప్పిట్లో ఉందన్నారు. అభివృద్ధి కోసం నిధులు ఇవ్వకుండా తప్పించుకునే హస్తం పార్టీ అసోంను అభివృద్ధి చేయగలదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో కేంద్రం నుంచి అసోం పన్ను వాటాగా రూ. 10,000 కోట్లు మాత్రమే అందుకునేదన్నారు. ఇప్పుడు బీజేపీ సర్కార్ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కన్నా 5 రెట్లు ఎక్కువను పన్ను వాటాగా అందుకుంటోందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ విస్మరించిన ఈశాన్య ప్రాంతాలకు తాము భక్తితో సేవ చేస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ అసంతృప్తికి అతిపెద్ద కారణం ఓటు బ్యాంకు రాజకీయాలే. హస్తం పార్టీ ఎప్పుడూ అసోంను ఎన్నికల కోణంలోనే చూసింది. ఆ పార్టీ హయాంలో కేంద్ర ప్రభుత్వ పథకాలు అసోంకు చేరడానికి సంవత్సరాల కాలం పట్టింది. కానీ బీజేపీ ఎల్లప్పుడూ అసోం, ఈశాన్య ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూనే ఉంది. కొంతకాలం క్రితం దేశంలో మొట్టమొదటి స్లీపర్ వందే భారత్ రైలు అసోం నుంచే ప్రారంభమైంది. సెమీకండక్టర్ రంగంలో అసోం వృద్ధి ఇంజిన్‌గా మారుతోంది. ఇక్కడ తయారయ్యే చిప్‌ల గురించి అసోం టీ లాగా ప్రపంచవ్యాప్తంగా చర్చించుకునే రోజు ఎంతో దూరంలో లేదు. ఆ రాష్ట్ర వృద్ధి ప్రయాణాన్ని చాయ్ నుంచి చిప్స్ వరకు చూడవచ్చని అన్నారు. కాంగ్రెస్ హయాంలో 3జీ, 4జీ టెక్నాలజీ వచ్చిందని, అలాగే 2+ స్కామ్ కూడా వచ్చిందని మోదీ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ దశాబ్దాల పాలనలో ఎయిమ్స్‌ల గురించి పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ పాలనలో అసోంలో హింస, వేర్పాటువాదం ఉండేదన్నారు. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ నేతృత్వంలో ఎన్?డీఏ సర్కార్ శాంతి, శ్రేయస్సు, వేగవంతమైన అభివృద్ధి అనే సంకల్పంతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఒకప్పుడు బాంబు పేలుళ్లతో దద్దరిల్లిన అసోంలో ఇప్పుడు శాంతి నెలకొందన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఈశాన్య ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేసిందని మోదీ మండిపడ్డారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్?డీఏ ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని అష్టలక్ష్మిగా పరిగణిస్తుందని అన్నారు. అసోంలో మౌలిక సదుపాయాల పెంపుదలకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కాంగ్రెస్ భారత్‌ను ఒక దేశంగా పరిగణించడానికి కూడా నిరాకరిస్తుందని, భారతమాత పట్ల కనీస గౌరవం కూడా చూపదని ఆరోపించారు. బీజేపీ కార్యకర్తగా ఉండటం తన జీవితంలోని గొప్ప గౌరవం అన్నారు. "2014 నాటికి దేశంలో కేవలం 6 ఎయిమ్స్‌లు మాత్రమే ఉన్నాయి. ఆ ఏడాదే దేశానికి సేవ చేసే అవకాశాన్ని ప్రజలు నాకు ఇచ్చారు. ఆ తర్వాత కాలంలో ఎయిమ్స్‌ల సంఖ్య భారీగా పెరిగింది. బీజేపీ సర్కార్ గువాహటిలో ఎయిమ్స్‌ను ఏర్పాటు చేసింది. నిన్ననే 'పీఎం-రాహత్' పథకానికి ఆమోదం తెలిపాం. దేశంలోని ఏ ప్రాంతంలోనైనా, ఎవరైనా ప్రమాదంలో గాయపడితే కేంద్ర ప్రభుత్వం రూ. 1.5 లక్షల వరకు ఉచిత చికిత్సను అందిస్తుంది. గత 11 ఏళ్లలో వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల కోసం అసోంకు కేంద్ర ప్రభుత్వం రూ. 5.5 లక్షల కోట్లకు పైగా నిధులను కేటాయించింది. ఈశాన్య ప్రాంతాల కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాం. కనెక్టివిటీ పెరిగే కొద్దీ ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. ఇటీవల గువాహటిలో పరీక్ష పే చర్చ కార్యక్రమం జరిగింది. బ్రహ్మపుత్ర నదిపై క్రూయిజ్‌లో విద్యార్థులతో నేను చర్చించాను. రాబోయే ఐదేళ్లు అసోంకు చాలా కీలకం." అని మోదీ పేర్కొన్నారు. అసోం అభివృద్ధిలో, ప్రజల జీవితాల్లో బ్రహ్మపుత్ర నదిది ప్రముఖ పాత్ర అని మోదీ పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ 70 ఏళ్ల పాలనలో బ్రహ్మపుత్ర నదిని దాటడం ఎల్లప్పుడూ పెద్ద సవాలుగా ఉందదేదని ఆరోపించారు. దాదాపు 7 దశాబ్దాల పాలనలో ఆ పార్టీ బ్రహ్మపుత్ర నదిపై కేవలం 3 వంతెనలను మాత్రమే నిర్మించాయన్నారు. గత 10-11 ఏళ్లలో బీజేపీ సర్కార్ బ్రహ్మపుత్ర నదిపై ఐదు పెద్ద వంతెనలను పూర్తి చేసిందని తెలిపారు. కాంగ్రెస్ అసోంకు సమస్యలను మాత్రమే ఇచ్చిందని, బీజేపీ మాత్రం వాటికి పరిష్కారాలను చూపిందన్నారు.

# తొలిదశ నపార్లమెంట్ పమావేశాలు ముగింపు



పార్లమెంట్ బడ్జెట్ తొలిదశ సమావేశాలు ముగిసాయి. యధావిధిగా రాష్ట్రపతి ప్రసంగం, బడ్జెట్ ప్రసంగం, రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం వంటివన్నీ యథాలాపంగా ముగించేశారు. నానాటికి తీసికట్టు నాగంబొట్లు అన్నట్లుగా.. ఈ సమావేశాలను కూడా మొక్కుబడి గానే ముగించేశారు. బడ్జెట్ కేటాయింపుల్లో పెద్దగా మెరుపేలమీ లేవు. ప్రభుత్వం చెబుతన్నదే చర్విత‌చరణంగా చెబుతున్నారు. ఇకపోతే స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాస తీర్మానం ఒకటి ఈ సమావేశాల్లో ప్రధాన అంశంగా మారింది. తమకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదన్నది ప్రధాన ప్రతిపక్షం ఆరోపణగా ఉంది. స్పీకర్, ప్రబుత్వానికి సంబంధించినంత వరకు ఇదో మరక లాంటిదే. చరిత్రలో ఫలానా స్పీకర్ తీరుపై అవిశ్వాసం పెట్టారని గుర్తుండిపోతుంది. నిజానికి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఎంతో ముఖ్యమైనవి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చలోనే అనేక విషయాలు ప్రస్తావనకు వస్తాయి. పాలకపక్షాన్ని విపక్షాలు నిలదీస్తాయి. విపక్షాలకు అలాంటి అవకాశం రావడం లేదు. అలాగే అవకాశం వచ్చేలా విపక్షం కూడా వ్యవహరించడం లేదు. చర్చ జరిగితే ప్రజల సమస్యలు దేశానికి తెలిసేవి. కానీ మొక్కుబడి సమావేశాలు సాగుతున్న తీరు దురదృష్టకరం. రాష్ట్రపతి ప్రసంగంపై రాజ్యసభలోనే ప్రధాని సమాదానం చెప్పి సరిపుచ్చారు. మోడీ అధికారంలోకి వచ్చాక విపక్షాల సమస్యలను ఆకళింపు చేసుకోవడమో లేదా, వారినుంచి చర్చను ఆహ్వానించడమో జరగడం లేదు. అర్థవంతమైన చర్చలను చూసి పార్లమెంట్ ఎన్నో ఏళ్లు గడిచి పోతున్నాయి. పార్లమెంటుకు ప్రధాని సమాధానం ఇవ్వకపోవడం చాలా బాధాకరం. ప్రతిపక్ష నేతగా రాహుల్ ప్రసంగానికి కూడా అవకాశం ఇవ్వడం లేదు. ఇకపోతే విపక్షనేతను పార్లమెంట్‌కు అనర్హుడిని చేయాలని బిజెపి సభ్యుడు కూడా ప్రతిపాదించడం కేవలం కక్షసాధింపు చర్యగానే చూడాలి. తమ తప్పుల్ని కప్పి పుచ్చుకోవడానికి, వాటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి పాలకపక్షం చేస్తున్న ప్రయత్నాలు ఎంతోకాలం సాగవని గుర్తించాలి. అమెరికాతో ఒప్పందం కావచ్చు, యూరోపియన్ యూనియన్‌తో ఒప్పందం కావచ్చు.. పార్లమెంటు చర్చించాల్సి ఉంది. ప్రభుత్వ తీసుకుంటున్న నిర్ణయాలపై చర్చ సాగాలి. కానీ అలా సాగడం లేదు. అధికార పార్టీ నేతలు అడుగడుగునా రాహుల్ గాంధీ నిలదీసి ప్రశ్నిస్తున్నారు. దానిబదులు అతను ఏం చెబుతాడో తెలుసుకుంటే బాగుండేది. రాహుల్ గాంధీ ఇస్తున్న వాయిదా తీర్మానాలు ఎలాగూ చర్చకు రావడం లేదు. కనీసం మరో విధంగా చర్చకు తీసుకునే అవకాశం గురించి రాహుల్ ఆలోచించడం లేదు. ఒకవేళ సమస్యలపై సిరయస్‌గానే చర్చ జరగాల్సి ఉంటే అందుకు అనేక రకాల మార్గాలు ఉన్నాయి. రూల్స్ పొజిషన్ ఉంది. అలా చర్చను కోరే అవకాశం సులువు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం పేర నడుస్తున్న ప్రహసనంలో ఏం జరిగిందో దేశ ప్రజలకు తెలియాలి. అమెరికా మధ్యంతర ఒప్పందం కారణంగా దాని ప్రభావం మనదేశ రైతాంగంపై పడుతుందన్న భావన ఉంది. అలాంటిదేమీ లేదని పాలకవర్గం చెబుతోంది. అవే విషయం పార్లమెంట్ వేదికగా చెప్పివుంటే బాగుండేది. దేశ ఉత్పత్తులపై సుంకాన్ని జీరో శాతానికి తేవడం అంటే.. ఇక్కడి చిన్న, సన్నకారు వ్యవసాయదారుల్ని, వ్యాపారుల్ని రోడ్డున పడేయడమేనని అంటున్నారు. దేశాన్ని పట్టి పీడిస్తున్న అనేక సమస్యలకు పార్లమెంట్ చర్చల ద్వారా పరిష్కారం చూపాల్సి ఉంది.

అమెరికాతో వాణిజ్య ఒప్పంద నిర్ణయం చిన్నవిషయం కాదు. ఇది కేవలం మోడీకి సంబంధించినది అస్సలే కాదు. పార్లమెంటును విశ్వాసం తీసుకోవాల్సింది. కీలకమైన విషయాల్లో ఈ దేశ పార్లమెంటును విశ్వాసంలోకి తీసుకోవడం అవసరం. కానీ అలా జరగడంలేదు. వాణిజ్య ఒప్పందం కోసం రష్యాతో చమురు కొనుగోళ్లు తగ్గించినా అమెరికా మనల్ని పాకిస్తాన్‌తో సమానంగా చూడడం దురదృష్టకరం. ఇప్పుడు ప్రధానిగా ఈ దేశ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత మోడీపై ఉంది. అనేక సమస్యలను చర్చించడానికి పార్లమెంట్‌కు అవకాశం కల్పించాలి. ప్రజల అనుమానాలు నివృత్తి చేయాలి. దేశ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నట్లు వస్తున్న ఆరోపణలకు సవివరమైన సమాధానం రావాల్సి ఉంది. అప్పుడే పార్లమెంట్‌కు విలువ ఉంటుంది. ఇందుకు తాము అనుగుణంగా ఉన్నామా లేమా అన్నది ఇరుపక్షాలు బేరీజు వేసుకోవాల్సి సమయం కూడా.

# అమెరికా ఒప్పందంతో రైతులకు తీవ్ర నష్టం

**వస్త్ర పరిశ్రమ, పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతారు**

**ఒప్పందంపై భ్రమలు కల్పిస్తున్న ప్రధాని మోదీ**

**కాంగ్రెస్ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ**



న్యూఢిల్లీ: అమెరికాతో మోదీ సర్కార్ చేసుకున్న ఒప్పందం కారణంగా దేశంలో వస్త్ర పరిశ్రమ, పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి ఆరోపించారు. ప్రధాని, ఆయన కేబినెట్ మంత్రులు ప్రజల్లో భ్రమలు కల్పిస్తున్నారని ఆయన ఎక్స్‌లో దుయ్యబట్టారు. అమెరికా నుంచి పత్తిని దిగుమతి చేసుకుంటేనే, భారత వస్త్ర పరిశ్రమకు సుంకాల మినహాయింపు ఉంటుందనే విషయాన్ని ఎందుకు దాచారని ఆయన ప్రశ్నించారు. బంగ్లాదేశ్ కూడా భారత్ నుంచి పత్తి దిగుమతులను నిలిపివేసే సంకేతాలు ఇస్తోందని, తద్వారా రైతులకు నష్టం జరుగుతుందని రాహుల్ గాంధీ ఆరోపించారు. దూరదృష్టి గల ప్రభుత్వం అయితే పత్తి రైతులు, టెక్స్‌టైల్ ఎగుమతిదారుల ప్రయోజనాలను కాపాడేలా ఒప్పందం చేసుకునేదని రాహుల్ అన్నారు. భారత్‌లోని టెక్స్‌టైల్ రంగం 5 కోట్ల కుటుంబాలకు ఉపాధినిస్తోంది. నరేంద్ర మోదీ అమెరికాతో చేసుకున్న ఒప్పందం భారత టెక్స్‌టైల్ రంగాన్ని అంతం చేస్తుంది. ఈ విషయం నరేంద్ర మోదీకి, మొత్తం భారతదేశానికి తెలుసు. అదే నేను పార్లమెంటులో చెప్పాను. బంగ్లాదేశ్‌కు 0% పన్ను, భారత్‌కు 18% పన్ను విధిస్తున్నారు. అందువల్ల భారత టెక్స్‌టైల్ పరిశ్రమను బంగ్లాదేశ్ టెక్స్‌టైల్ పరిశ్రమ దెబ్బతీస్తుంది. మనకు కూడా ఆ రాయితీ కావాలంటే అమెరికా నుంచి పత్తిని దిగుమతి చేసుకోవాలని కేంద్రమంత్రి ఒకరు చెప్పారు. కానీ అసలు నిజం ఏమిటంటే మన పత్తి బంగ్లాదేశ్‌కు వెళ్తుంది. మన పత్తి ద్వారానే భారత్‌లో టెక్స్‌టైల్ మిల్లులు నడుస్తున్నాయి. ఒకవేళ మనం బంగ్లాదేశ్ లాగా అమెరికా పత్తిపై ఆధారపడితే మన దేశంలో పత్తి రైతులు, వస్త్ర పరిశ్రమ నాశనమైపోతాయి. ఒకవేళ మనం అమెరికా పత్తిని దిగుమతి చేసుకోకపోతే మన టెక్స్‌టైల్ పరిశ్రమ దెబ్బతింటుంది. ఇదే అసలు నిజం. పీయూష్ గోయల్ అబద్ధాలు చెప్పవద్దు. అందుకే 'సరెండర్' అంటున్నాను. ఎందుకంటే ఈ ఒప్పందం వల్ల పత్తి రైతు నష్టపోతాడని అన్నారు. ఒకవేళ మోదీ ప్రభుత్వం జాతీయ ప్రయోజనాల కోసం ఆలోచించి ఉంటే పత్తి రైతులు, వస్త్ర ఎగుమతిదారుల శ్రేయస్సును రక్షించే విధంగా చర్చలు జరిపి ఉండేదని రాహుల్? గాంధీ వ్యాఖ్యానించారు. మోదీ, ఆయన ప్రభుత్వం కలిసి రెండు రంగాలకు తీవ్ర నష్టం కలిగించే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారని ? ఆరోపించారు. ఈ ఒప్పందం కారణంగా పత్తి, వస్త్ర పరిశ్రమ రంగాలపై ఆధారపడి ఉన్న కోట్లాది మంది భారతీయుల కుటుంబాలను నిరుద్యోగం, ఆర్థిక సంక్షోభం అనే గొయ్యిలోకి నెట్టివేశారని రాహుల్? గాంధీ విమర్శించారు. గత వారం భారత్?-అమెరికా మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. అయితే, ఈ ఒప్పందంలో యూఎస్? పారిశ్రామిక వస్తువులు, విస్తృత శ్రేణి ఆహార, వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలను తొలగించడం లేదా తగ్గించడం వంటివి ఆ ఒప్పందంలో ఉన్నాయి. వీటిలో పశుగ్రాసం కోసం ఎర్ర జొన్న, చెట్ల గింజలు, తాజా ప్రాసెస్ చేసిన పండ్లు, సోయాబీన్ నూనె, వైన్, స్పిరిట్స్, అదనపు ఉత్పత్తులు ఉన్నాయి. ప్రతిగా, యునైటెడ్ స్టేట్స్ వస్త్రాలు, తోలు, పాదరక్షలు, ప్లాస్టిక్, రబ్బరు, సేంద్రీయ రసాయనాలు, గృహాలంకరణ, చేతివృత్తుల ఉత్పత్తులు వంటి ఎంపిక చేసిన భారతీయ వస్తువులపై 18 శాతం సుంకాలను వర్తింపజేయనుంది. అయితే ఒప్పందం పూర్తిగా అమల్లోకి వచ్చిన తర్వాత, జెనరిక్ ఫార్మాస్యూటికల్స్, రత్నాలు, వజ్రాలు, విమాన భాగాలు వంటి వస్తువులపై అమెరికా విధించిన సుంకాలు తొలగిపోనున్నాయి.

# ఎలక్ట్రిక్ వాహనాలు కొనేవారికి శుభవార్త..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహన కొనుగోలుదారులకు శుభవార్త వినిపించింది. విద్యుత్ వాహనాలు (ఎలక్ట్రిక్ వాహనాలు) కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్ చేసుకునే వారికి పూర్తి పన్ను రాయితీ అందిస్తోంది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. సస్టైనబుల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ 4.0 అమల్లో ఉన్నంత కాలం విద్యుత్ వాహనాలకు రోడ్ ట్యాక్స్ మినహాయింపు వర్తిస్తుందని ఏపీ ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే హైబ్రిడ్ నాలుగు చక్రాల వాహనాలకు మాత్రం ఈ నిర్ణయం వర్తించదని ఏపీ రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే ఉత్తర్వులు జారీ చేశారు.

పర్యావరణ పరిరక్షణ కోసం అనేక చర్యలు చేపడుతున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుదారులకు ఏపీ ప్రభుత్వం శుభవార్త అందించింది. రాష్ట్రంలో ఎలక్ట్రికల్ వాహనాలను కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్ చేసుకునేవారికి పన్ను రాయితీ కల్పిస్తున్నారు. ఈ మేరకు రోడ్ ట్యాక్స్ రాయితీ ఇస్తున్నట్లు ఏపీ రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. 2024 ఎన్నికల్లో విజయం సాధించి అధికారంలోకి వచ్చిన అనంతరం టీడీపీ కూటమి సర్కారు అనేక పాలసీలు తీసుకువచ్చింది. క్రీడా పాలసీ, నూతన ఇసుక పాలసీ, లిక్కర్ పాలసీ ఇలా అనేక విధానాలను అమల్లోకి తెచ్చారు. సస్టైనబుల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ 4.0ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల అమల్లోకి తెచ్చింది.



ఈ సస్టైనబుల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ అమలులో ఉన్నంత కాలం ఎలక్ట్రిక్ వాహనాలను మోటారు వాహన పన్ను మినహాయింపు ఉంటుందని ఏపీ ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. పర్యావరణ పరిరక్షణ కోసం ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. అయితే పూర్తిగా ఎలక్ట్రిక్ ఇంజిన్లు ఉన్న వాహనాలకు మాత్రమే పన్ను రాయితీ ఉంటుందని.. హైబ్రిడ్ నాలుగు చక్రాల వాహనాలకు మాత్రం వర్తించదని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది. పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ ఎలక్ట్రిక్ వాహనాల వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. మరోవైపు పెట్రోల్, డీజిల్ వంటి సంప్రదాయ ఇంధన వనరుల వాడకం ద్వారా వాతావరణ కాలుష్యంతో పాటుగా ఇంధనాల కొరత తలెత్తే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగంపై ఏపీ ప్రభుత్వం దృష్టి సారించింది. అలాగే ప్రజలను పర్యావరణ అనుకూలమైన జీవన విధానానికి మారాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలోనే విద్యుత్ వాహనాలు కొనుగోలు చేసే వారికి రాయితీలు అందిస్తున్నారు. ఈ రాయితీల ద్వారా ఈవీల వాడకం పెరుగుతుందని.. దీంతో కర్బన ఉద్గారాల తగ్గుదలతో పాటు ప్రజలకు ఆర్థికంగా కూడా కలిసొస్తుందని భావిస్తోంది. ఈ క్రమంలోనే ప్రజా రవాణా వ్యవస్థలోనూ ఎలక్ట్రిక్ వాహనాల వాడకంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆలోచిస్తోంది.ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుకు చర్యలు చేపడుతోంది.

# ప్రధాని మోదీ యూట్యూబ్ ఆదాయం ఎంతో తెలుసా..

సోషల్ మీడియాలో ప్రధాని మోదీకి ఉండే ఫాలోయింగ్ చూస్తే మైండ్ బ్లాంక్ అవుతుంది. కోట్ల మంది సబ్‌స్క్రైబర్లు, ఫాలోవర్లు కలిగి ఉన్న ప్రపంచ దేశాల అధినేతల్లో మోదీ ముందువరుసలో ఉంటారు అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అయితే తాజాగా ప్రధాని మోదీకి యూట్యూబ్ ఛానల్ ద్వారా ఎంత ఆదాయం వస్తుందో తెలుసా. అది తెలిస్తే అన్ని కోట్లు వస్తుందా అని మీరు నోరెళ్లబెట్టడం ఖాయం.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. రాజకీయాల్లో చాలా యాక్టివ్‌గా ఉంటారు. అదే సమయంలో సోషల్ మీడియాలో కూడా ప్రధాని మోదీ ఎన్నో రికార్డులను కొల్లగొట్టారు. ఇక ఆయనకు సోషల్ మీడియాలో ఉన్న ఫాలోవర్ల సంఖ్య కోట్లల్లో ఉంటుంది. ప్రధాని ఏదైనా పోస్ట్ పెట్టారంటే చాలు.. అది కోట్లల్లో లైక్‌లు, షేర్లు, కామెంట్లతో వైరల్ అవుతూ ఉంటుంది. ఈ క్రమంలోనే ప్రపంచంలోనే అత్యధిక మంది ఫాలోవర్లు కలిగి ఉన్న రాజకీయ నేతగా ఆయన ముందువరుసలో ఉంటారు. ఇక యూట్యూబ్‌లో ప్రధాని మోదీ ఛానల్‌కు ఎంతమంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు.. వారి వల్ల ఎంత ఆదాయం వస్తుందో తెలిస్తే షాక్ అవుతారు.

ప్రధాని మోదీకి ఫేస్‌బుక్, ట్విటర్, సహా వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో అకౌంట్లు ఉన్నాయి. అదేవిధంగా ప్రధానమంత్రికి నరేంద్ర మోదీ అనే అధికారిక యూట్యూబ్ ఛానల్ కూడా ఉంది. ఈ ఛానల్ 2007 అక్టోబర్ 26వ తేదీన ప్రారంభించారు. ప్రధాని చేపట్టే అన్ని ప్రాజెక్టు ప్రారంభోత్సవాలు, ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రధాని మోదీ ఇంటర్వ్యూలతోపాటు ఆయనకు సంబంధించిన అన్ని కార్యక్రమాలను ఈ ఛానల్‌లో ప్రసారం చేస్తూ ఉంటారు. అయితే ప్రధాని మోదీ ట్యూబ్ ఛానల్‌కు 26.5 మిలియన్ల సబ్‌స్క్రైబర్లు ఉన్నారు.

ప్రపంచవ్యాప్తంగా యూట్యూబ్‌లో 20 మిలియన్లకు పైగా సబ్‌స్క్రైబర్స్ ఉన్న ఏకైక రాజకీయ నేతగా నరేంద్ర మోదీ తొలి స్థానంలో నిలిచారు. అంతేకాకుండా వ్యూస్, లైక్స్ ద్వారా ఈ నరేంద్ర మోదీ ఛానల్ ప్రతినెలా భారీగా ఆదాయాన్ని సంపాదిస్తోంది. ఒక %జఱుఎ×ు% విడుదల చేసిన ఒక రిపోర్ట్ ప్రకారం నరేంద్ర మోదీ యూట్యూబ్ ఛానల్ నెలకు 1.89 లక్షల డాలర్ల నుంచి 5.67 లక్షల డాలర్ల మధ్య ఉంటుందని తేలింది. అంటే మన భారత కరెన్సీలో అక్షరాలా రూ.1.62 కోట్ల నుంచి.. రూ.4.88 కోట్లను నెలకు ఆర్జిస్తున్నారు. ఇక నరేంద్ర మోదీ యూట్యూబ్ ఛానల్ ఇప్పటివరకు 29,272 వీడియోలను అప్‌లోడ్ చేసింది. వాటికి మొత్తంగా 636 కోట్ల వ్యూస్ వచ్చాయి.

ఇక ఈ నరేంద్ర మోదీ యూట్యూబ్ ఛానల్‌లో అప్‌లోడ్ చేసిన చాలా వీడియోలు 40 వేల వ్యూస్ దాటుతున్నాయి. సబ్‌స్క్రైబర్ల సంఖ్య కూడా భారీగానే పెరుగుతోంది.



అత్యధిక వ్యూస్ కారణంగా నరేంద్ర మోదీ యూట్యూబ్ ఛానల్ భారీ మొత్తంలో ఆదాయాన్ని సంపాదిస్తోంది. ఈ ఛానల్‌లో ప్రతి వారం సగటున 19 వీడియోలు అప్‌లోడ్ అవుతున్నాయి. మరోవైపు.. నరేంద్ర మోదీకి ఫేస్‌బుక్‌లో 48 మిలియన్ల మంది ఫాలోవర్స్ ఉండగా.. ఇన్‌స్టాగ్రామ్ లో 82.7 మిలియన్ల మంది ఫాలోవర్లు ఉన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తర్వాత యూట్యూబ్ సబ్‌స్క్రైబర్స్ పరంగా బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సోనార్ రెండో స్థానంలో ఉన్నారు. జైర్ బోల్సోనార్‌కు 6.4 మిలియన్ల సబ్‌స్క్రైబర్స్ ఉండగా.. మోదీ సబ్‌స్క్రైబర్స్‌తో పోల్చితే ఈ సంఖ్య 4వ వంతు మాత్రమే ఉండటం గమనార్హం.

# పోస్టాఫీస్ అద్భుత పథకం..

ఇందులో ఒకటి నేషనల్ సేవింగ్స్ రికరింగ్ డిపాజిట్ అకౌంట్. ఇక్కడ కనీసం నెలకు రూ. 100 పెట్టుబడితో చేరొచ్చు. గరిష్ట పరిమితి లేదు. మీరు నెలకు రూ. 5 వేలు లేదా రూ. 10 వేలు ఆదా చేయాలనుకుంటున్నారా.? మీరు కేంద్ర ప్రభుత్వ మద్దతు ఉన్న పోస్టాఫీస్ పథకాల్లో నెలకు ఇంత మొత్తం ఇన్వెస్ట్ చేయడం ద్వారా మెచ్యూరిటీకి లక్షల్లో రిటర్న్ పొందే అవకాశం ఉంటుంది. ఇక్కడ చిన్న మొత్తాల్లో డబ్బులు ఇన్వెస్ట్ చేసే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ మద్దతు ఉంటుంది కాబట్టి ఎలాంటి రిస్క్ లేకుండా గ్యారెంటీగా రిటర్న్ పొందొచ్చు. పోస్టాఫీసు పథకాలు చాలానే ఉన్నప్పటికీ.. అన్నీ వేటికవే ప్రత్యేకతల్ని కలిగి ఉంటాయి. మహిళల కోసం, ఆడపిల్లల కోసం, ఉద్యోగుల కోసం, సీనియర్ సిటిజెన్ల కోసం ఇలా చాలానే పథకాలు ఉన్నాయి. ఇదే చిన్న మొత్తాల పొదుపు పథకాల్లో ఒకటైన పోస్టాఫీస్ రికరింగ్ డిపాజిట్ అకౌంట్. దీంట్లో ప్రస్తుతం జనవరి- మార్చి త్రైమాసికానికి గానూ వడ్డీ రేటు 6.7 శాతంగా ఉంది. కనీసం రూ. 100 నుంచి ఇందులో పెట్టుబడులు పెట్టొచ్చు. గరిష్ట పరిమితి ఏం లేదు. సింగిల్‌గా లేదా జాయింట్‌గా ఈ పథకంలో చేరేందుకు అవకాశం ఉంది. మైనర్ పేరిట గార్డియెన్ అకౌంట్ తెరవొచ్చు. పదేళ్లు పైబడిన వారు సొంతంగా అకౌంట్ తెరవొ చ్చు. ఎన్ని అకౌంట్లు అయినా ఓపెన్ చేయొచ్చు.అయితే ఇక్కడ పెట్టుబడులపై లోన్ కూడా తీసుకోవచ్చు. అకౌంట్ తెరిచిన మూడేళ్ల తర్వాత ముందస్తుగా అకౌంట్ ఉపసంహరించు కోవచ్చు. ఇక మెచ్యూరిటీ పీరియడ్ ఐదేళ్లుగా ఉంది. అకౌంట్ మెచ్యూరిటీ తర్వాత మరో ఐదేళ్లు పొడిగించు కునే అవకాశం ఉంది. అంటే మొత్తం పది సంవత్సరాలు ఇన్వెస్ట్ చేయొచ్చు. ఉదాహరణకు మనం ఇందులో నెలకు రూ. 5 వేల చొప్పున ఇన్వెస్ట్ చేస్తే.. 6.7 శాతం వడ్డీ రేటు ప్రకారం.. ఐదేళ్లకు మీ పెట్టుబడి రూ. 3 లక్షలు కాగా.. వడ్డీ రూపంలో రూ. 56,830 వస్తుంది. అదే మరో ఐదేళ్లు పొడిగిస్తే అప్పుడు చేతికి రూ. 8,54,272 వస్తుంది. ఇక్కడ వడ్డీతోనే రూ. 2.54 లక్షలు అందుకోవచ్చు. నెలకు 5 వేలు అంటే.. రోజుకు రూ. 166 చొప్పున ఆదా చేస్తే సరిపోతుంది. ఇదే నెలకు రూ. 10 వేలతో చూస్తే.. ఐదేళ్లకు వడ్డీతోనే రూ. 1.13 లక్షలు అందుకోవచ్చు. అదే మరో ఐదేళ్లు పొడిగిస్తే ఇక్కడ రూ. 5 లక్షలకుపైగా వడ్డీ పొందొచ్చు.

# సామాన్యులకు బంపరాఫర్..

ఇంకా దేశంలో క్రమానుగత పెట్టుబడుల్ని మరింత ప్రోత్సహించే దిశగా.. సామాన్య ప్రజలకు అందుబాటులో ఈ పథకాల్ని తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు సెబీ చీఫ్ మాధవి పురి తెలిపారు. రూ. 250 సిప్ తేనున్నట్లు వెల్లడించారు.

ప్రస్తుతం మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు పెట్టేందుకు చాలా మంది ఆసక్తి చూపిస్తున్నారన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం దీంట్లో కనీసం రూ. 500 తో సిప్ చేసేందుకు అవకాశం ఉంది. ఇప్పటికీ రూ. 500 అంటే చాలా మందికి, చిన్న చిన్న పనులు చేసుకునే వారికి కష్టంగానే ఉంటుంది. అందుకే ఈ సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్‌ను మరింత ప్రోత్సహించేందుకు.. సామాన్య ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కృషి చేస్తున్నట్లు సెబీ చీఫ్ మాధవి పురి చెప్పారు. ఇందుకోసం త్వరలోనే రూ. 250 సిప్ చేసే వీలు కలుగుతుందని .. వీలైనంత త్వరలోనే దీనిని తీసుకొస్తామని ఆమె గతంలో చెప్పగా మరోసారి పునరుద్ఘాటించారు. అతిత్వరలోనే రూ. 250 సిప్ ప్రారంభించనున్నట్లు స్పష్టం చేశారు. తక్కువ సిప్‌తో కూడా లాంగ్ రన్‌లో ఎక్కువ రాబడి అందుకునే అవకాశం ఉంటుంది. ఇంకా చిన్న, మధ్య స్థాయి కంపెనీల బోర్డు ప్రతిపాదనలకు అనుమతులు ఇచ్చే సమయం తగ్గించేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు మాధవి పురి.ఇష్యూలకు అనుమతులు ఇచ్చేందుకు సెబీకి 3 నెలల సమయం పడుతుందని.. టెక్ టూల్స్‌ను మరింత వినియోగించి సమయం తగ్గిస్తామని శుక్రవారం రోజు సెబీకి చెందిన నిర్వహించిన సదస్సులో ఆమె వెల్లడించారు. మరోవైపు మ్యూచువల్ ఫండ్ సంస్థల కొత్త ఆఫర్లకు కూడా వేగంగా అనుమతులు ఇచ్చేందుకు ప్రయత్నిస్తామని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్టాక్ మార్కెట్స్ రూ. 14.27 లక్షల కోట్ల మేర సమీకరించనున్నట్లు పేర్కొన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సమీకరించిన రూ .11.8 లక్షల కోట్లతో పోలిస్తే ఇది 21 శాతం ఎక్కువని అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 9 నెలల్లో మొత్తం మీద రూ. 10.7 లక్షల కోట్ల వరకు సంస్థలు సమీకరించాయని.. జనవరి- మార్చితో కలిపి రూ. 14.27 లక్షల కోట్లకు చేరొచ్చని అంచనా వేశారామె. ఇటీవలి కాలంలో మ్యూచువల్ ఫండ్లలో చాలా మంది ఇన్వెస్ట్ చేస్తున్నారు. కనీసం రూ. 500 సిప్ చేసే వారి సంఖ్య కూడా ఎక్కువగా ఉంది. ఇలా పెట్టుబడులు పెట్టినా కూడా దీర్ఘకాలంలో పెద్ద మొత్తంలో రిటర్న్ అందుకునేందుకు అవకాశం ఉంది. ఇక్కడ ప్రధానంగా కాంపౌండింగ్ ఎఫెక్ట్ కీలక పాత్ర పోషిస్తుంటుంది.

# ‘చోటే భాయ్’ని కాపాడుతున్న ‘బడే భాయ్’..



హైదరాబాద్: ఎస్ఎల్‌బీసీ సొరంగం ఘటన జరిగి 200 రోజులు దాటినా కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరుగురి మృతదేహాలను కూడా వెలికితీయలేకపోయింది. ఇంకా కుటుంబాలకు ఎలాంటి పరిహారం కూడా చెల్లించలేదంటూ ఎక్స్ వేదికగా నిలదీశారుకాళేశ్వరం ప్రాజెక్టులో చిన్నపాటి సమస్యలకే జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందాన్ని పంపించి హంగామా సృష్టించిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం.. ఎస్ఎల్‌బీసీ ఘటనపై దర్యాప్తు చేయడానికి ఎందుకు ఒక్క బృందాన్ని కూడా పంపలేదంటు కేటీఆర్ ప్రశ్నించారు. బీజేపీ బడే భాయ్ ఎందుకు తెలంగాణలో కాంగ్రెస్ చోటే భాయ్‌ని కాపాడుతున్నారంటూ దుయ్యబట్టారు.బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చిన రోజున,

ఆ ఆరు కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తాం.

ఆ ఆరుగురి ప్రాణాలను బలిగొన్న వారికి శిక్ష పడేలా చేస్తాం.

కాంగ్రెస్ విధ్వంసం చేసిన ప్రతి దానితో పాటు ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలిపోవడానికి గల కారణాలకు మేము సమాధానాలు రాబడతాం” అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.



# జూబ్లీహిల్స్‌లో

## గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అంశానికి సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి తన నివాసంలో సమీక్ష చేపట్టారు. ఆదివారం(సెప్టెంబర్ 14వ తేదీ) జూబ్లీహిల్స్ ఎన్నికపై పలువురు కాంగ్రెస్ నేతలతో చర్చిస్తున్నారు. దీనికి పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, జూబ్లీహిల్స్ ఇంచార్జ్ మంతరులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్‌లతో సర్వే ఏజెన్సీల నుంచి పలువురు హాజరయ్యారు. ఈ నెలాఖరులో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నోటిఫికేషన్

వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో జూబ్లీహిల్స్‌లో అభివృద్ధి పనులు , అభ్యర్థి ఎంపిక పై మంత్రులతో సీఎం చర్చిస్తున్నారు. జూబ్లీహిల్స్ రేసులో నవీన్ యాదవ్, బొంతు రామ్మోహన్, అంజన్ కుమార్ యాదవ్‌లు పోటీలు ఉన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికపై సీక్రెట్ సర్వే రిపోర్ట్‌ను సీఎంకు అందజేశారు పీసీసీ చీఫ్‌దీనిలో భాగంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. ‘ జూబ్లీహిల్స్

ఉప ఎన్నికలో గెలుపు కోసం ప్రతీ ఒక్కరు పని చేయాలి. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను, అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాలి. పోలింగ్ బూత్‌ల వారీగా ప్రచార ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి. నియోజకవర్గంలో సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందన్న భరోసా కల్పించాలి.

# మరో పోరాటం తప్పదు..

హైదరాబాద్:రెండేళ్లుగా రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని విద్యాసంస్థల యాజమాన్యాలు మొత్తుకుంటున్నా రేవంత్ సర్కారు మొద్దు నిద్ర నటిస్తుండటం సిగ్గుచేటు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై పోరుబాట అంటూ పీడీఎస్‌యూ రూపొందించిన బిగ్ డిబేట్ పోస్టర్‌ను హైదరాబాద్‌లోని తన నివాసంలో హరీశ్‌రావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, పీజీ, ఫార్మసీ, బీఈడీ, ఎంబీఏ, ఎంసీఏ, ఇంజినీరింగ్ విద్యాసంస్థలు మూతపడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 13 లక్షల విద్యార్థుల భవిష్యత్తు అగమ్య గోచరంగా మారిందని అన్నారు. సెమిస్టర్ పరీక్షలు కూడా వాయిదా వేసే పరిస్థితి వస్తుంటే విద్యాశాఖ మంత్రిగా కూడా ఉన్న ముఖ్యమంత్రి ఏం చేస్తున్నట్లు అని నిలదీశారు.సోమవారం నుంచి నిరసనలు, నిరాహార దీక్షలు, నిరవధిక బంద్‌లు చేయనున్నట్లు ప్రకటించినప్పటికీ ఎందుకు నోరు మెదపడం లేదని సీఎం రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు నిలదీశారు. ‘అల్లరి చేయొద్దు’ అని ఆర్థిక మంత్రి సుద్దులు చెప్పినంత మాత్రాన యాజమాన్యాలు, విద్యార్థుల గోడు తీరదని అన్నారు.







# బరువు తగ్గడమే కాదు గుండెకు కూడా మంచిదే..!


బొబ్బర్లు.. వీటిని కొన్ని ప్రాంతాల్లో అలసంద గింజలని కూడా పిలుస్తుంటారు. బొబ్బర్లతో వడలు, పునుగులు, దోశలు ఇలా రకరకాల వంటలు తయారు చేసుకోవచ్చు. బొబ్బర్లు రుచిగా ఉండటమే కాదు.. పోషకాలు అధికంగా ఉంటాయి. బొబ్బర్లలో ప్రొటీన్లు, ఫైబర్, విటమిన్ ఫోలిక్ యాసిడ్, రాగి, ఐరన్, కాల్షియం, మాంగనీస్, మెగ్నీషియం, సోడియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలు మన ఆరోగ్యాన్ని రక్షిస్తాయి. బొబ్బర్ల మన డైట్‌లో తరచూ తీసుకుంటే.. అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు. అవేంటో ఈ స్టోరీలో చూద్దాం.

**బొబ్బర్లలో ఉండే మరో మంచి భాగం లిగ్నిన్. ఇది ప్రాథమి కంగా క్యాన్సర్ , స్ట్రోక్, హైపర్ టెన్షన్, బోలు ఎముకల వ్యాధి వంటి అనేక ప్రాణాంతక వ్యాధు లను దరిచేరకుండా రక్షిస్తుంది.**

చెడు కొలెస్ట్రాల్ తగ్గిస్తుంది.. బొబ్బర్లు తరచు మన డైట్‌లో చేర్చుకుంటే.. శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు కంట్రోల్‌లో ఉంటాయి. వీటిలో కరిగే డైటరీ ఫైబర్, ప్రొటీన్ అధికంగా ఉంటాయి. ఇవి రక్తం ప్లాస్మాలో ఉన్న చెడు కొలెస్ట్రాల్ మొత్తాన్ని తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తాయి. బొబ్బర్లలోని ఫైటోస్టెరాల్స్ అనే స్టెరాయిడ్ సమ్మేళనాలు ఉంటాయి. బొబ్బర్లు మన ఆహారంలో చేర్చుకుంటే.. గుండె సమస్యలు, స్ట్రోక్, హైపర్‌టెన్షన్ ముప్పు తగ్గుతుంది. బొబ్బర్ల గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉన్న ఆహార పదార్థాలు.. లిపిడ్ ప్రొఫైల్‌కు చాలా ప్రయోజనకరంగా ఉంటుందని అనేక పరిశోధనలు నిరూపించాయి.



షుగర్ పేషెంట్స్‌కు మేలు చేస్తుంది.. బొబ్బర్లలో కరిగే ఫైబర్ అధికంగా ఉంటుంది. షుగర్ పేషెంట్స్ వారి డైట్ తరచూ బొబర్లు చేర్చుకుంటే.. బ్లడ్ షుగర్ లెవల్స్ కంట్రోల్‌లో ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను కంట్రోల్‌లో ఉంచడానికి, డయాబెటిస్ మెల్లిటస్ ముప్పును తగ్గించడానికి సహాయపడతాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. బొబ్బర్లలో కొవ్వు, క్యాలరీలు తక్కువగా ఉంటాయి. ఇవి బరువు తగ్గడానికి సహాయపడ తాయి. వీటిలో సోడియం కంటెంట కూడా తక్కువగా ఉంటుంది. కొలెస్ట్రాల్ కంటెంట్ సున్నా ఉంటుంది. ఇవన్నీ బరువు తగ్గిగంచడానికి , బరువును కంట్రోల్‌లో ఉంచడానికి తోడ్పడతాయి.



గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి.. బొబ్బర్లలోని ఫ్లేవనాయిడ్లు, మెగ్నీషియం, పొటాషియం గుండె కండరాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఇవి ఇన్ఫ్లమేటరీ మార్కర్లను తగ్గిస్తుంది. బొబ్బర్లలో డైటరీ ఫైబర్, ప్రొటీన్ సమృద్ధిగా ఉంటాయి, ఇవి చెడు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్, రక్తపోటు స్థాయిలను కంట్రోల్‌లు ఉంచడానికి సహాయపడతాయి. వీటిలో చాల్లీలో ఫైటోస్టెరాల్ సమ్మేళనాలు కూడా ఉంటాయి, ఇవి శరీరంలో లిపిడ్ ప్రొఫైల్‌ను నిర్వహించడానికి తోడ్పడతాయి. ఈ అనారోగ్యాలకు చెక్ పెడుతుంది.. బొబ్బర్లలో ఉండే మరో మంచి భాగం లిగ్నిన్. ఇది ప్రాథమికంగా క్యాన్సర్ , స్ట్రోక్, హైపర్‌టెన్షన్, బోలు ఎముకల వ్యాధి వంటి అనేక ప్రాణాంతక వ్యాధులను దరిచేరకుండా రక్షిస్తుంది. చర్మ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. . బొబ్బర్లలోని అధిక ప్రొటీన్ కంటెంట్ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుం ది. చర్మ రంధ్రాలు తెరుచుకొనేలా చేస్తుంది. వాటిలోని యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్ ఎ, సి చర్మ కణాలను రక్షిస్తాయి. తద్వారా మృదువైన, ఆరోగ్యకరమైన చర్మం పొందవచ్చు.

# గుడ్లు ఎక్కువ రోజులు తాజాగా..



గుడ్లలో ప్రోటీన్లు ఎక్కువగా ఉంటాయి. పిల్లలు, పెద్దలు ఎక్కువగా తింటారు. కాబట్టి, ఎక్కువగా తీసుకొస్తారు. అయితే, వీటిని ఎక్కువ రోజులు అలానే తాజాగా ఉండాలంటే కొన్ని టిప్స్ పాటించాలి. ఫ్రిజ్‌లో.. సాల్మొనెల్లా బ్యాక్టీరియా గుడ్ల షెల్, లోపల ఉంటుంది. ఈ బ్యాక్టీరియా పెరుగుదల గది ఉష్ణోగ్రత కంటే చల్లగా ఉంటుంది. ఫ్రిజ్లో పెడితే బ్యాక్టీరియా గుడ్డుపైనే కాకుండా మిగతా పదార్థాలపై కూడా వ్యాపిస్తుంది. కాబట్టి, వీటిని ఫ్రిజ్‌లో పెట్టొద్దు. గుడ్డు ఎక్కువకాలం తాజాగా ఉండాలంటే వాటిని ఎక్కువగా కదపడకూ డదు. వెడల్పుగా ఉండే భాగాన్ని పై భాగానికి కొంచెం వెడల్పుగా ఉండే భాగాన్ని కింద భాగాన్ని ఉంచాలి. దీని వల్ల ఎక్కువ కాలం తాజాగా ఉంటాయి.

మనం జనరల్‌గా వంటకి రిఫైండ్ ఆయిల్ వాడతారు. ఈ ఆయిల్‌తో రెండు వారాల పాటు గుడ్డు పాడవ్వకుండా చేయొచ్చు. గుడ్డు పెంకుపై కొద్దిగా వంట నూనె వేయండి. గుడ్లు కనీసం 10 నుండి 12 రోజుల వరకూ తాజాగా ఉంటాయి. టిష్యూ పేపర్స్.. గుడ్డు ఎక్కువ రోజులు చెడిపోకుండా ఉండాలంటే ఒక్కో గుడ్డుని టిష్యూ పేపర్స్‌తో



చుట్టి స్టోర్ చేయండి. దీని వల్ల ఈ గుడ్లు ఎక్కువ రోజులు తాజాగా ఉంటాయి. ఇలాంటి కొన్ని టిప్స్ పాటిస్తే గుడ్లు ఎక్కువ రోజులు తాజాగా ఉంటాయి. కాబట్టి, చక్కగా వీటిని ఫాలో అయి గుడ్లని ఎక్కువరోజులు తాజాగా ఉంచుకోవచ్చు.

# నీళ్లు తాగకూడదు..!






ఏదైనా ఆహారం తినేప్పుడు.. నీళ్లు తాగడం సహజం. అయితే, కొన్ని ఆహారపదార్థాలు తినేప్పుడు.. నీరు తాగకూడదని నిపుణులు చెబుతున్నారు. చాలా ఆహార పదార్థాలతో నీరు తీసుకోవడం సురక్షితం కాదని అంటున్నారు, వీటి కారణంగా అజీర్ణం, అసౌకర్యం కలిగే అవకాశం ఉందని అంటున్నారు. నీటితో కలిపి తీసుకోకూడని ఆహారం పదార్థాలు ఏమిటో ఈ స్టోరీలో చూద్దాం.

అరటిపండులో కరిగే ఫైబర్ అధికంగా ఉంటుంది. అరటిపండు తినేప్పుడు నీళ్లు ఎక్కువగా తాగితే.. కడుపులోని గ్యాస్ట్రిక్ జ్యూస్‌లు కరిగిపోతాయి. దీని కారణంగా జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని.. అరటిపండ్లు తినేప్పుడు నీళ్లు తాగొద్దని నిపుణులు సూచిస్తున్నారు.

కమల, ద్రాక్షపండ్లు, బత్తాయి, నిమ్మకాయలు వంటి సిట్రస్ పండ్లలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. ఈ పండ్లు తినేప్పుడు నీళ్లు తాగితే.. కడుపు అసౌకర్యంగా ఉంటుంది, కడుపు పూర్తిగా నిండిన అనుభూతి ఉంటుంది. వాటిని మితంగా తీసుకోవడం, అవి తిన్న తర్వాత గ్యాప్ ఇచ్చి నీళ్లు తాగడం మంచిది.

పెరుగులో ప్రొబయోటిక్స్ మెండుగా ఉంటాయి. ఇది పేగుల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. పెరుగు తిన్న తర్వాత నీళ్లు తాగితే.. ఈ ప్రోబయోటిక్స్ ఎఫెక్ట్ తగ్గుతుంది.

మసాలా ఆహారం, స్పైసీ ఫుడ్స్‌తో నీళ్లు ఎక్కువగా తాగితే.. అసౌకర్యాన్ని కలిగిస్తాయి. నీరు వేడిని వ్యాపింపజేస్తుంది, మంటను మరింత తీవ్రతరం చేస్తుంది. స్పైసీ ఫుడ్స్ తిన్నప్పుడు నోరు చల్లబరచడానికి పాలు, పెరుగు వంటి పాల ఉత్పత్తులు మంచి ఎంపిక. రైస్‌తో పాటు నీళ్లు ఎక్కువగా తాగితే.. జీర్ణక్రి యకు అవసరమైన యాసిడ్స్ డైల్యూట్ అవుతాయి. అన్నం తినేప్పుడు నీరు ఎక్కువగా తాగితే.. జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఇవి పాటించడం వల్ల ఫలితాలు అనేవి వ్యక్తిగతం మాత్రమే. వీటిని పాటించే ముందు డైటీషియన్‌ని సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.

# ప్లాస్టిక్ కప్పుల్లో టీ తాగుతున్నారా..

టీ తాగడం చాలా మందికి ఇష్టం. కానీ, ఎక్కువగా తాగడం వల్ల చాలా సమస్యలు వస్తాయి. రోజుకి రెండు కప్పుల కంటే ఎక్కువగా తాగడం అంత మంచిది కాదు. దీని వల్ల ఏయే సమస్యలు వస్తాయో పూర్తి వివరాలు తెలుసుకోండి. ఆఫీసులో టీ తాగడం వల్ల శరీరానికి, మనసుకి రీఫ్రెష్‌గా ఉంటుంది. ముఖ్యంగా జాబ్ చేసేవారు రోజుకి రెండు సార్ల కంటే ఎక్కువసార్లు తాగుతారు. బాడీ రిఫ్రెష్ అవ్వడానికి అప్పడ ప్పుడు తాగడం మంచిది కాదు. అదే టీ తాగేటప్పుడు విషయాలను గుర్తుపెట్టుకోవాలి.




ప్లాస్టిక్ కప్స్.. చాలా ఆఫీసుల్లో ఎంప్లాయిస్ టీలు ప్లాస్టిక్ కప్పులో తాగుతారు. అయితే, ఇది అస్సలు మంచిది కాదు. వీటి బదులు సిరామిక్ కప్స్‌లో తాగడం, టంబ్లర్ వాడడం మంచిది. ప్లాస్టిక్ కప్పుల నుండి టీ తాగడం వల్ల పేగుల్లో మైక్రోప్లాస్టిక్ కణాలు చేరతాయి. ముఖ్యంగా రోజుకి రెండు, మూడు సార్లు టీ తాగే వ్యక్తులకి ఇవి తాగిన ప్రతిసారి లోపలికి ప్రవేశించి హాని చేస్తాయి. ఇవి క్యాన్సర్‌కి కారణవుతాయి. ఇది ఇలానే కొనసాగితే మీ ఎండోక్రైన్ వ్యవస్థ దెబ్బతిని, పునరుత్పత్తి వ్యవస్థపై కూడా ఎఫెక్ట్ పడుతుంది. దీనిని బట్టి వంధ్యత్వ సమస్యలు కూడా వస్తాయి.



భోజన సమయంలో.. ఆఫీసులో టీ తాగడం వల్ల చాలా మందికి రిలాక్స్‌డ్‌గా ఉంటుంది. బాగా అలసిపోయినప్పుడు మాత్రమే తీసుకోవడం మంచిది. మధ్యాహ్న భోజనానికి గంట ముందు, గంట తర్వాత టీ తీసుకోకపోవడమే మంచిది. టెంపరేచర్.. మీరు ఆఫీస్‌లో ఏసీ రూమ్‌లో కూర్చుని ఉంటారు. ఆ టైమ్‌లో గోరువెచ్చని టీ తాగడం మంచిది. అయితే, ఆఫీస్ బయట వాతావరణాన్ని గమనించాలి. దీని గురించి చెప్పాలంటే, బయట వేడిగా ఉన్న సమయాల్లో ఎక్కువగా టీ తాగడం మానుకోవాలి.

పంచదార.. మీరు ఆఫీసులో ఎన్నిసార్లు టీ తాగుతున్నారో మాత్రమే మీరు ట్రాక్ చేస్తారు. కానీ, మీరు చక్కెరని కలిపిన ప్రతిసారి అది మీ రోజువారీ కేలరీలని పెంచుతుంది. రోజుకి సగటున తీసుకునే కేలరీలను 2000 అయితే, మీరు ఆఫీసులో రోజుకి రెండు, మూడు కప్పుల టీ తాగిన ప్రతిసారీ కనీసం ఓ చెంచా చక్కెర కలిపినా, ఆ చక్కెర మాత్రమే మీ శరీరానికి 300 కంటే ఎక్కువ కేలరీలను అందిస్తుంది. ఇది ఊబకాయం, రక్తంలో చక్కెర స్థాయిలు, జీవక్రియ వంటి పనితీరుపై ఎఫెక్ట్ చూపిస్తుంది. ఆఫీసులో పనిచేసినప్పుడు కొన్నిసార్లు అలసటగా అనిపించినప్పుడు కప్పు టీ తాగుతారు. అయితే, రోజుకి రెండు కప్పుల కంటే ఎక్కువగా టీ తాగితే నిద్రసమస్యలు రావడం పక్కా. టీలోని కెఫిన్ మనకు రీఫ్రెష్‌మెంట్ ఇచ్చినప్పటికీ రెండు కప్పులకి మించి తాగొద్దని చెబుతున్నారు నిపుణులు.

# ముఖంపై ముడతలు తగ్గుతాయి..



వయసు పెరిగేకొద్దీ ముఖంపై ముడతలు వస్తాయి. అలాంటప్పుడు కొన్ని టిప్స్ పాటిస్తే ముడతలు తగ్గుతాయి. అవేంటో ఇప్పుడు తెలుసుకోండి.అందాన్ని పెంచడంలో ఇంటి చిట్కాలు హెల్ప్ చేస్తాయి. ముఖ్యంగా ముడతల్ని తగ్గించడంలో కూడా ఇంటి చిట్కాలను వాడొచ్చు. ఇందుకోసం కోడిగుడ్డు తెల్లసొన కూడా హెల్ప్ చేస్తుంది. తెల్లసొన వాడడం వల్ల చర్మంపై ముడతలు తగ్గుతాయి. ఇది చర్మ రంధ్రాల్లోకి చొచ్చుకుపోయి చర్మ రంధ్రాలను క్లీన్ చేస్తుంది. మరి ఈ ఎగ్ మాస్క్ ఎలా ప్రిపేర్ చేయాలి. దీని వల్ల కలిగే లాభాలు ఏంటో తెలుసుకోండి.



ముడతలు రావడానికి కారణాలు.. సాధారణంగా వయసు పెరిగే కొద్దీ ముడతలు పెరుగుతా యి. స్కిన్ కేర్ లేకపోవడం, హై కెమికల్స్ క్రీమ్స్ వాడడం, పోషకాహార లోపం, హైడ్రేషన్ తగ్గడం వల్లే చిన్న వయసులో ముడతలు వస్తాయి. వీటికి ఇంటి చిట్కాలతో చెక్ పెట్టొచ్చు. ఎగ్ వైట్, కాఫీ మాస్క్.. కావాల్సిన పదార్థాలు... 1 కోడిగుడ్డు తెల్లసొన, కాఫీ పొడి -1 చెంచా, టమాట రసం 2 చెంచాలు, తయారీ విధానం.. ముందుగా గుడ్డు తెల్లసొన బీట్ చేయండి. అందులోనే టమాట రసం, కాఫీ పొడి వేసి బాగా కలపండి. ముందుగా ఫేస్‌ని క్లీన్ చేసి ఓ టవల్‌ని వేడి నీటిలో ముంచి బాగా పిండాలి. టవల్ వేడిగా ఉన్నప్పుడే ముఖంపై పెట్టండి. దీంతో చర్మ రంధ్రాలు ఓపెన్ అవుతాయి. ఇప్పుడు గుడ్డులోని తెల్లసొనని ముఖానికి అప్లై చేసి 20 నిమిషాల పాటు అలానే ఉంచి క్లీన్ చేయండి. బెనిఫిట్స్.. వారానికి రెండు సార్లు ఈ ఫేస్ మాస్క్ వాడితో చర్మ మలినాలు తొలగిపోయి మృత చర్మ కణాలు తొలగిపోతాయి. చర్మంపై ముడతలు, ఫైన్‌లైన్లని తగ్గిస్తాయి. ఇది క్లియర్ స్కిన్‌ని అందించి మంచి యాయిశ్చరై జింగ్ లక్షణాలను అంది చర్మాన్ని యవ్వనంగా చేస్తుంది. నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. అందం, ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.



# వాడుతున్న తేనె మంచిదేనా..?





తేనె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని మనందరికీ తెలుసు. దీనిలో మెండుగా ఉండే.. ఔషధగుణాలు అనేక ఆరోగ్య సమస్యల నుంచి రక్షిస్తాయి. తేనెలో యాంటీఆక్సిడెంట్లు మెండుగా ఉంటాయి. ఇవి శరీరానికి హాని చేసే ఫ్రీరాడికల్స్‌తో పోరాడతాయి. తేనె, నిమ్మరసం నీళ్లు తాగడం వల్ల పొట్ట ఆరోగ్యంగా ఉంటుంది. తక్షణ శక్తి లభిస్తుంది. రోగనిరోధకతా పెరుగుతుంది. అయితే, మార్కెట్లో కల్తీ తేనె దందా ఎక్కువైంది. చెరకు, వరి, మొక్కజొన్న, బీట్రూట్, గోధుమల నుంచి సుగర్ సిరప్ తయారు చేసి తేనెలో మిక్స్ చేస్తున్నారు. అడవి తేనె అని చెప్పుకూంటూ రోడ్ల పక్కన అమ్మేవారూ.. తేనె పేరిట బెల్లం పాకాన్ని పిండి ఇస్తున్నారు. అయితే, కల్తీ తేనె ఆరోగ్యానికి హాని చేస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కల్తీ తేనెను

ఇంట్లోనే ఎలా గుర్తించాలో ఈ స్టోరీలో చూద్దాం. ఇంట్లోనే తేనె స్వచ్ఛతను గుర్తించడానికి.. వాటర్ డిసోల్యూషన్ టెస్ట్ సహాయపడుతుంది. ఈ టెస్ట్ చేయడానికి, ఒక గ్లాసు నీటిలో ఒక టేబుల్ స్పూన్ తేనె మిక్స్ చేయండి. ఆ తేనె స్వచ్ఛమైనదైతే.. అది నీటిలో సులభంగా కరగదు.. గ్లాసు అడుగున స్థిరపడుతుంది. ఒకవేళ మీ తేనె నీటిలో సులభంగా కరిగిపోతే.. అది కల్తీదని అర్థం. చాలా కంపెనీలు చెరకు, వరి, మొక్కజొన్న, బీట్రూట్, గోధుమల సిరప్‌లు వేసి తేనె అని నమ్మిస్తున్నారు. ఇవి నీళ్లలో సులభంగా కరుగుతాయి. ఇంట్లోనే తేనె స్వచ్ఛతను గుర్తించడానికి... పేపర్ టవల్ టెస్ట్ సులభమైన పద్ధతి. ఇది చేయడానికి పేపర్ టవల్ షీట్ తీసుకుని దానిపై తేనె వేయండి. తేనె స్వచ్ఛంగా ఉంటే.. పేపర్ టవల్ షీట్ దాన్ని త్వరగా పీల్చుకోలేదు. తేనె చుక్క స్టేబుల్‌గా ఉంటుంది. దాని సహజ స్నిగ్ధత, మందాన్ని ప్రదర్శిస్తుంది. ఒకవేళ పేపర్ టవల్ షీట్ తేనెను త్వరగా పీల్చుకుంటే అది కల్తీ అయ్యిందని అర్థం. దానిలి నీళ్లు, చక్కెర పాకం ఉండొచ్చు. తేనె కల్తీని గుర్తించడానికి.. హీట్ టెస్ట్ ఎఫెక్టివ్‌గా పనిచేస్తుంది. కొంచెం తేనె తీసుకుని.. వేడి చేయండి. స్వచ్ఛమైన తేనె కారామెలైజ్ అవుతుంది, బంగారు రంగులోకి మారుతుంది, మంచి వాసన వస్తుంది. ఒకవేళ తేనె కల్తీదైతే.. తేనె కాలిపోతుంది, కాలిన వాసన వస్తుంది. తేనె రంగు ద్వారా.. దాని స్వచ్ఛతను గుర్తించ వచ్చు. స్వచ్ఛమైన తేనె సాధారణంగా బంగారం, కాషాయం రంగులో ఉంటుంది. తేనె వచ్చే మూలం బట్టి కూడా దాని రంగు కొద్దిగా మారవచ్చు. మీ తేనె చాలా స్పష్టంగా కనిపిస్తే, లేత రంగులో ఉంటే.. దానిలో నీరు, స్వీటెనర్లు యాడ్ చేశారని అర్థం. తేనె కాలక్రమేణా మందంగా మారుతుంది, స్ఫటికలుగా మారుతుంది. ఈ ప్రక్రియ పూర్తిగా సహజమైనది, ఇలా జరిగితే అది స్వచ్ఛమైనదని అర్థం. ఒకవేళ మీ తేనె ఎప్పటికీ స్ఫటికలుగా మారకుండా, ద్రవ స్థితి లోనే ఉంటే.. అది ఉత్పత్తి సమయంలో అధిక వేడి, ప్రాసెసింగ్‌కు గురైందని అర్థం. ఇవి స్ఫటికీకరణకు కారణమయ్యే సహజ ఎంజైమ్‌లు, కణాలను నాశనం చేయ గలవు. వెనిగర్‌ను ఉపయోగించి.. తేనె స్వచ్ఛతను గుర్తించవచ్చు. స్వచ్ఛమైన తేనెకు సహజంగా ఎసిడిక్ స్వభావం ఉంటుంది, వెనిగర్ మాదిరిగానే తక్కువ ఉంటుంది. కాబట్టి ఇది దానితో వెంటనే రియాక్ట్ అవ్వదు. కల్తీ తేనెలో నీరు, చక్కెర యాడ్ చేసి ఉండవచ్చు.

# డెస్క్ బాజ్ చేస్తున్నారా..?

ఆఫీసుల్లో కుర్చీ మీద కూర్చొని పనిచేయడాన్ని మనం సంతోషంగా భావిస్తాం. అయితే గంటల తరబడి కుర్చీకి అతుక్కుపోయి పనిచేయడం మన ఆరోగ్యానికి హాని చేస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. శారీరక శ్రమలేనివారికి, ఎక్కువసేపు కూర్చువడం, డెస్క్ జాబ్ చేసే వాళ్లకు, నిశ్చల జీవనశైలి పాటిస్తున్నవారికి



మతిమరపు వచ్చే ముప్పు ఎక్కవగా ఉంటందని ఓ అధ్యయనం స్పష్టం చేసింది. అయినప్పటికీ జీన్స్, వయస్సు, జీవనశైలి ఎంపికలు, హెల్త్ కండీషన్ కూడా మతిమరపు వచ్చే అవకాశాన్ని ప్రభావితం చేయగలవని నిపుణులు చెబుతున్నారు. అయితే శారీరకంగా చురుగ్గా ఉండే వారితో పోలిస్తే నిశ్చల జీవనశైలి ఉన్న వ్యక్తులకు చిత్తవైకల్యం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని ఒక అధ్యయనం గుర్తిం చింది. శారీరక శ్రమ స్థాయిలతో సంబంధం లేకుండా ఎక్కువసేపు కూర్చోవడం వల్ల చిత్తవై కల్యం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని అధ్యయనం చూపించింది. ఈ జాగ్రత్తలు తీసుకోండి.. కూర్చునే చోట టేబుల్‌ను బాగా పైకి కాకుండా, కిందకు



కాకుండా సరైన పద్ధతిలో అమర్చుకోవాలి. చేతులపై ఒత్తిడి పడకుండా అవి సేదతీరేలా టేబుల్‌పై ఉంచుకునేలా టేబుల్‌ను అమర్చుకోవాలి. కుర్చీని కూడా బాగా ఎత్తులో కాకుండా, బాగా కిందకు కాకుండా కాళ్లను నేలకు ఆనించేలా మాత్రమే కుర్చీ ఉండేలా చూసుకోవాలి. ఎక్కువసేపు కూర్చోకుండా గంట, గంటన్నరకు ఒకసారి లేచి అటూఇటూ నడవాలి. ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. శారీరక శ్రమ లేకపోవడం.. ఎక్కువసేపు కూర్చోవడం వల్ల శారీరక శ్రమ తక్కువవుతుంది, ఇది డిమెన్షియా ముప్పు పెంచుతుంది. రెగ్యులర్ వ్యాయామం మెదడుకు రక్త ప్రవాహాన్ని ప్రోత్సహిస్తుంది, అభిజ్ఞా పనితీరును మెరుగుపరుస్తుంది. తరచూ వ్యాయామం చేస్తే.. అభిజ్ఞా క్షీణత ప్రమాదాన్ని తగ్గిస్తుంది. నిశ్చల ప్రవర్తన పెరుగుతుంది.. విరామం లేకుండా ఎక్కువసేపు కూర్చోవడం నిశ్చల జీవనశైలికి దారి తీస్తుంది. పైన చెప్పినట్లుగా, నిశ్చల ప్రవర్తన అభిజ్ఞా బలహీనత, చిత్తవైకల్యంతో ముప్పుతో ముడిపడి ఉందని పరిశోధనలు సూచిస్తున్నాయి. నిశ్చల ప్రవర్తన పెరుగుతుంది.. విరామం లేకుండా ఎక్కువసేపు కూర్చోవడం నిశ్చల జీవనశైలికి దారి తీస్తుంది. పైన చెప్పినట్లుగా, నిశ్చల ప్రవర్తన అభిజ్ఞా బలహీనత, చిత్తవైకల్యంతో ముప్పుతో ముడిపడి ఉందని పరిశోధనలు సూచిస్తున్నాయి.



# ఫోటో వైరల్

మెగాస్టార్ చిరంజీవి ఇంట, అభిమానులలో పండుగ వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. ఇటీవల రామ్ చరణ్, ఉపాసన దంపతులకు కవలలు జన్మించారు. అయితే.. ఇప్పుడు ఆ ట్విన్స్‌కు నామకరణం చేశారు. అబ్బాయికి శివరామ్, అమ్మాయికి అన్వీరా దేవి అని పేర్లు పెట్టినట్లు చిరంజీవి సోషల్ మీడియా వేదికగా తెలిపారు. చిరంజీవి అసలు పేరులోని శివ, రామ్ చరణ్ పేరులోని రామ్ తీసుకుని ఈపేర్లు పెట్టినట్లు అర్థం అవుతోంది. అలాగే అన్వీరా దేవి అంటే ధైర్యవంతురాలైన అమ్మవారు అనే అర్థం ఉంది. ఈ పేర్లకు అర్థాలు చెబుతూ చిరంజీవి పోస్ట్ పెట్టారు. "అమితమైన ఆనందంతో, దేవుని కృపతో మా చిన్నారుల అందమైన పేర్లను ప్రకటించడానికి మేము సంతోషిస్తున్నాము.

' శివ రామ్ కొణిదెల' 'అన్వీరా దేవి కొణిదెల'. శివరామ్.. ఇద్దరు ఆదర్శవంతుల లోతైన సంగమం. 'శివ' అనేది శివ శంకర వర ప్రసాద్ నుంచి ప్రేరణ పొందింది. ఇది అంతర్గత బలం, ఆధ్యాత్మిక, నిశ్చలతను ప్రతిబింబిస్తుంది.

రామ్ చరణ్ లోని 'రామ్' అనే పదం నీతి, కరుణ, నైతిక ధైర్యాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ పేరు అంతర్గత శక్తి, బాధ్యతాయుతమైన చర్యల మధ్య సామరస్యాన్ని సూచిస్తుంది"

"అన్వీరా దేవి.. దేవతా మూర్తి యొక్క అరుదైన, పవర్ ఫుల్ ఎక్స్ ప్రెషన్. కనక దుర్గా దేవి ఆశీర్వాదాల ద్వారా ప్రేరణ పొందిన అన్వీరా.. నిర్భయత, స్థితిస్థాపకత, దైవిక రక్షణను సూచిస్తుంది. ఇది ధైర్యం, అచంచలమైన బలాన్ని ప్రతిబింబించే పేరు. శివరామ్, అన్వీరా దేవి అందమైన జీవిత ప్రయాణాన్ని ప్రారంభించడానికి మేము మీ అందరి ఆశీర్వాదాలను కోరుకుంటున్నాము" అని చిరంజీవి తన పోస్టులో రాసుకొచ్చారు. ఈ సందర్భంగా కవలల బారసాల వేడుక ఫొటోను పంచుకున్నారు.

# పసుపు వేడుక..



అల్లు కుటుంబానికి చెందిన హీరో అల్లు శిరీష్ త్వరలోనే పెళ్లి పీటలెక్కబోతున్న సంగతి తెలిసిందే.. నిర్మాత అల్లు అరవింద్ చిన్న కుమారుడిగా, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తమ్ముడిగా సినీ అభిమానులకు పరిచయమైన శిరీష్ ఇప్పటివరకు బ్యాచిలర్ జీవితాన్ని ఎంజాయ్ చేస్తూ వచ్చారు. ఇప్పుడు తన జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభించేందుకు సిద్ధమవుతూ వైవాహిక బంధంలోకి అడుగుపెట్టబోతున్నారు. శిరీష్ తన చిరకాల స్నేహితురాలు నయనికని పెళ్లాడబోతున్నారు. వీరి నిశ్చితార్థం గతేడాది అక్టోబర్ నెలలో ఘనంగా జరిగింది. కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో జరిగిన ఆ వేడుక అప్పట్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వీరి ముహూర్తం మార్చి 6న నిర్ణయించారు. ఇక్కడ ఆసక్తికర అంశం ఏమిటంటే, అల్లు అర్జున్ -- స్నేహారెడ్డి దంపతుల వివాహ వార్షికోత్సవం కూడా అదే రోజు కావడం. అన్నయ్య పెళ్లిరోజునే తమ్ముడు పెళ్లి జరగనుండటం అల్లు కుటుంబానికి మధురమైన జ్ఞాపకంగా మిగిలిపోనుందని అభిమానులు భావిస్తున్నారు.

అల్లు శిరీష్ పెళ్లి వేడుకకు సమయం దగ్గర పడుతుండటంతో ఇప్పటికే వేడుకలు మొదలయ్యాయి. ఇటీవల దుబాయ్‌లో ప్రీ-వెడ్డింగ్ సెలబ్రేషన్స్ నిర్వహించగా తాజాగా హైదరాబాద్‌లోని అల్లు అరవింద్ నివాసంలో సంప్రదాయబద్ధంగా 'పసుపు దంచుడు' కార్యక్రమాన్ని నిర్వహించారు. సాధారణంగా హల్దీ పేరుతో గ్రాండ్‌గా చేసుకునే వేడుకను సింపుల్‌గా, ఇంటి వాతావరణంలో కుటుంబ సభ్యుల మధ్య నిర్వహించడం విశేషం. ఈ కార్యక్రమానికి సంబంధించిన వీడియోను శిరీష్ స్వయంగా సోషల్ మీడియాలో పంచుకోవడంతో అది నెట్టింట వైరల్‌గా మారింది. ఈ వేడుకలో అల్లు కుటుంబ సభ్యులతో పాటు మెగా కుటుంబానికి చెందిన పలువురు కూడా పాల్గొన్నారు. చిరంజీవి సతీమణి సురేఖ, పెద్దకుమార్తె సుష్మిత, కోడలు ఉపాసన సహా ఇతర బంధువులు, చిన్నారులు ఈ వేడుకలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇంట్లోనే సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ వేడుక అల్లు కుటుంబంలో పెళ్లి సందడిని స్పష్టంగా చూపించింది. శిరీష్ పెళ్లి చేసుకోబోయే నయనిక గురించి కూడా అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్తల కుటుంబానికి చెందిన ఆమెతో శిరీష్‌కు చాలా కాలంగా పరిచయం ఉంది. ఈ నేపథ్యంలోనే ఇరు కుటుంబాల అనుమతితో ఇద్దరూ ఒక్కటయ్యేందుకు సిద్ధమయ్యారు. అల్లు వారింట పెళ్లి వేడుకలు మొదలుకావడంతో మెగా ఫ్యాన్స్, నెటిజన్లు సోషల్ మీడియాలో శుభాకాంక్షలు చెబుతున్నారు.

# తెలంగాణ బ్యూటీ!



తెలుగు తెరపై ఈ మధ్య కాలంలో తెలుగు హీరోయిన్స్ జోరు పెరుగుతున్నట్టుగానే కనిపిస్తోంది. కొత్తగా ఇండస్ట్రీకి వస్తున్న దర్శకులు, కొత్త కథానాయికలను పరిచయం చేయడానికి ఎక్కువ ఉత్సాహాన్ని చూపిస్తున్నారు. ఓ మాదిరి బడ్జెట్ సినిమాల ద్వారా పరిచయమవుతున్న ఈ కథానాయికలు, ఆ తరువాత తమ టాలెంట్ తో నిలదొక్కుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అటు ఆంధ్ర నుంచి మాత్రమే కాదు, ఇటు తెలంగాణ వైపు నుంచి కూడా పరిచయమవుతున్న హీరోయిన్ల సంఖ్య కూడా పెరుగుతోంది. వరంగల్ నుంచి తెలుగు తెరకి పరిచయమైన ఆనంది, తమిళంలో స్టార్ డమ్ ను సంపాదించుకుంది. ఇప్పటికీ తెలుగులో సినిమాలు చేస్తోంది. ఈషా రెబ్బా కూడా తనదైన స్టైల్లో సినిమాలు .. సిరీస్ లు చేస్తూ వెళుతోంది. ఇక వైష్ణవి చైతన్య 'బేబీ' సినిమాతో సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. ఈ నేపథ్యంలో ఇప్పుడు 'మానస వారణాసి' పేరు ఎక్కువగా వినిపిస్తోంది. అందాల పోటీల్లో అనేక బహుమతులు గెలుచుకున్న ఈ బ్యూటీ, ఇప్పుడు 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాతో అలరించనుంది.

మానస వారణాసి ఇంతకు ముందు ఒక సినిమా చేసినప్పటికీ, కొన్ని కారణాల వలన అది ఆడియన్స్ కి రీచ్ కాలేదు. 'కపుల్ ఫ్రెండ్లీ' మాత్రం రిలీజ్ కి ముందే మంచి బజ్ తెచ్చుకుంది. 'వాలెంటైన్స్ డే' సందర్భంగా ఈ నెల 14వ తేదీన ఈ సినిమాను రిలీజ్ చేస్తూ ఉండటంతో, యూత్ అంతా ఈ సినిమాపైనే ఫోకస్ పెట్టింది. ఫ్యామిలీ ఎమోషన్స్ తో పాటు, పొయెటిక్ గా అనిపించేలా రొమాన్స్ ఉంటుందని చెప్పడం యూత్ ను ఎక్కువగా ఆకర్షిస్తోంది. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వంలో, సంతోష్ శోభన్ జోడీగా మానస వారణాసి తొలి హిట్ కొడుతుందేమో చూడాలి మరి.

# కొత్త రిలీజ్ డేట్



నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా, 'దసరా' ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ది ప్యారడైజ్'. ఇందులో నాని 'జడల్' అనే పవర్ ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ఎస్ఎల్‌వి సినిమాస్ పతాకంపై నిర్మిస్తున్న ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొని ఉన్నా యి. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని మా రుస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రక టించింది. ముందుగా ప్రకటించిన మార్చి 26కు బదులుగా, ఈ చిత్రాన్ని ఆగస్టు 21న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు నాని తన 'ఎక్స్' ఖాతాలో కొత్త పోస్టర్‌ను పంచుకుంటూ "2026 ఆగస్టు 21 అని పోస్ట్ చేశారు.

విడుదల తేదీ మార్పు వెనుక బలమైన వ్యూహం ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఆగస్టు 21 తర్వాత దాదాపు మూడు వారాల పాటు వరుస పండగలు రానున్నాయి. ఓనం, మిలాద్-ఉన్-నబీ, ఆ తర్వాత వారాంతంలో రక్షాబంధన్, మూడో వారంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వంటి పండగలు ఉండటంతో బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు రాబట్టేందుకు ఇది గొప్ప అవకాశంగా చిత్ర యూనిట్ భావిస్తోంది. ఇంతటి భారీ బడ్జెట్ చిత్రానికి ఈ సెలవుల సీజన్ బాగా కలిసొస్తుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. హైదరాబాద్‌లో వేసిన ఓ భారీ సెట్‌లో వందలాది మంది డ్యాన్సర్లతో నానిపై చిత్రీకరిస్తున్న ఇంట్రడక్షన్ సాంగ్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని సమాచారం. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్, నాని ఎనర్జీకి తగ్గట్లుగా హై-వోల్టేజ్ మాస్ నంబర్‌ను స్వరపరిచారు. సుధన్ మాస్టర్ కొరియోగ్రఫీలో ఈ పాటను విజువల్ వండర్‌గా తీర్చిదిద్దుతున్నారు.

'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల కాంబి నేషన్‌లో వస్తున్న రెండో చిత్రం కావడంతో 'ది ప్యారడైజ్'పై అంచనాలు ఆకాశాన్ని అంటాయి. ఈ సినిమాలో సంపూర్ణేష్ బాబు 'బిర్యానీ' అనే ఆసక్తి కర పాత్రలో నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు రాఘవ్ జుయల్ కూడా ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ పాత్ర కోసం తన లుక్‌ను పూర్తిగా మార్చుకోనున్నట్లు రాఘవ్ ఇదివరకే తెలిపారు. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళంతో పాటు ఇంగ్లీష్, స్పానిష్, బెంగాలీతో కలిపి మొత్తం 8 భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

# డైరెక్టర్‌గా



నందమూరి కుటుంబం నుంచి హీరోగా వచ్చి రాణిస్తున్న వారిలో కళ్యాణ్‌రామ్ ఒకరు. అయితే మిగతా వారితో పోలిస్తే ఆయనలో ఓ ప్రత్యేక లక్షణం కనిపిస్తుంది. అదే న్యూ టాలెంట్‌ని ప్రోత్సహించడం. హీరోగా మాత్రమే కాకుండా నిర్మాతగా కూడా ఆయన ఇండస్ట్రీలో ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. కమర్షియల్ అంశాలతో పాటు కంటెంట్‌కు ప్రాధాన్యం ఇచ్చే కథలను ఎంచుకోవడం, కొత్త దర్శకులను నమ్మి పెద్ద అవకాశాలు ఇవ్వడం కళ్యాణ్ రామ్ ప్రత్యేకతగా మారింది. ఆయన పరిచయం చేసిన దర్శకుల్లో కొందరు అగ్రస్థానానికి చేరుకున్నారు. ముఖ్యంగా 'పటాస్' సినిమాతో దర్శకుడిగా పరిచయమైన అనిల్ రావిపూడి ఇప్పుడు టాలీవుడ్‌లో హిట్ మెషిన్‌గా గుర్తింపు పొందారు. రచయితగా పలు విజయవంతమైన చిత్రాలకు పని చేసిన అనంతరం దర్శకుడిగా మారిన అనిల్ రావిపూడిని కళ్యాణ్ రామ్ నమ్మి అవకాశం ఇవ్వడం అప్పట్లో పెద్ద రిస్క్‌గా భావించారు. అయితే ఆ నిర్ణయం సూపర్ హిట్‌గా మారింది. అలాగే 'బింబిసార'తో దర్శకుడిగా పరిచయమైన వశిష్ట ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవితో 'విశ్వంభర' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.

అలాగని కళ్యాణ్‌రామ్ చేసిన ప్రతి ప్రయత్నం సఫలం కాలేదు. 'అమిగోస్', 'ది డెవిల్', 'అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి' వంటి సినిమాలు ఆశించిన స్థాయిలో ఫలితాలు ఇవ్వలేదు. ముఖ్యంగా 'బింబిసార' తర్వాత వచ్చిన వరుస పరాజయాలు కళ్యాణ్ రామ్ కెరీర్ గ్రాఫ్‌ని డౌన్ చేశాయి. ఈ నేపథ్యంలోనే ఆయన మరోసారి కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించనున్నట్టు సమాచారం. రచయితగా ఇప్పటికే పలు భారీ చిత్రాలకు పనిచేసిన శ్రీకాంత్ విస్సా ని దర్శకుడిగా పరిచయం చేయడానికి ఆయన సిద్ధమవుతున్నారనే టాక్ వినిపిస్తోంది. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ తెరకెక్కించిన 'పుష్ప', 'పుష్ప 2' వంటి చిత్రాలకు శ్రీకాంత్ విస్సా రచయితగా పని చేశారు. ఇప్పుడు ఆయన చెప్పిన కథ కళ్యాణ్ రామ్‌కు బాగా నచ్చడంతో ఈ ప్రాజెక్ట్‌ను గత ఏడాది చివర్లోనే లాక్ చేసినట్టు సమాచారం.

# మళ్లీ మొదలుపెట్టా

తెలుగు చిత్రసీమలో ఒకప్పుడు ఫ్యామిలీ హీరోగా ఎన్నో చిత్రాల్లో నటించి ఆ తర్వాత స్టైలిష్ విలన్‌గా మారి తనకంటూ ప్రత్యేకమైన స్థానం సంపాదించుకున్నాజగపతిబాబు. ప్రముఖ నిర్మాత వి.బి.రాజేంద్రప్రసాద్ కుమారుడిగా సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చిన ఆయన 1990వ దశకంలో రొమాంటిక్, ఫ్యామిలీ హీరోగా మంచి ఇమేజ్‌ను ఏర్పరుచుకున్నారు. మధ్య తరగతి భావోద్వేగాలను సహజంగా ఆవిష్కరించే నటుడిగా ప్రేక్షకుల మన్ననలు పొందారు. అయితే హీరోగా కెరీర్ ముగిసే క్రమంలో వరుస పరాజయాలు, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న ఆయన విలన్ పాత్రల ద్వారా తన సెకండ్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించారు. ముఖ్యంగా 'లెజెండ్' చిత్రం ఆయన కెరీర్‌కు టర్నింగ్ పాయింట్‌గా మారింది. ఆ తరువాత నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలు, బలమైన క్యారెక్టర్ రోల్స్ ద్వారా పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు.

ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్న జగపతిబాబు , ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన జీవిత ప్రయాణం గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. తాను బయటికి వెళ్లేటప్పుడు చాలాసార్లు వేషధారణ మార్చుకుంటూ ఉంటానని, ఒకసారి 45 నిమిషాలు బస్సో ప్రయాణం చేసిన తరువాతే ప్రజలు తనని గుర్తుపట్టారని చెప్పారు. ప్రతి సంఘటనను జీవితంలో ఓ అనుభవంగా తీసుకుంటానని ఆయన అభిప్రాయపడ్డారు. నటి సౌందర్య మరణవార్త జీవితంలో తనకు మరిచిపోలేని చేదు సంఘటనగా మిలిగిపోయిందన్నారు. ఓ సమయంలో తాను ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ, రోజుకు ఐదు వేల రూపాయల కోసం టీవీ సీరియల్స్‌లో నటించేందుకు కూడా సిద్ధమైన పరిస్థితి వచ్చిందని, ఆ టైమ్‌లో 'లెజెండ్' సినిమా తనకు కొత్త దారిని చూపించిందని, అదే తన పునర్జన్మగా భావిస్తున్నానని తెలిపారు.

ఇక గ్యాంబ్లింగ్ గురించి అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ, తాను అప్పుడప్పుడు పేకాట ఆడుతానని కానీ అది డబ్బు కోసం కాదని స్పష్టం చేశారు. డబ్బు ముందు మనుషుల ప్రవర్తన ఎలా మారుతుందో గమనించడానికే ఆడుతానని అన్నారు. కోట్ల రూపాయల చుట్టూ తిరిగే సమయంలో మనుషులలోని అత్యాశ, క్రూరత్వం ఎలా బయటపడుతుందో చూస్తే జీవితం గురించి చాలా నేర్చుకోవచ్చని వ్యాఖ్యానించారు. గొడవల సమయంలో మాటలతో దాడి చేయడం కంటే మౌనం పాటించడం మంచిదని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే వృద్ధ దేగ తన పాత గోర్లు, ముక్కు, ఈకలను తొలగించి మళ్లీ శక్తివంతంగా పునర్జన్మ పొందినట్లే, తన జీవితం కూడా అలాంటి మార్పు దశను దాటిందని చెప్పారు.



# గట్టిగానే ప్లాన్



టాలీవుడ్‌లో కంటెంట్‌కు ప్రాధాన్యం ఇచ్చే దర్శకుల్లో క్రిష్ జాగర్లమూడి పేరు ముందు వరుసలో ఉంటుంది. సామాజిక సందేశాలతో కూడిన కథలను విభిన్న కోణంలో చూపిస్తూ తనకంటూ ప్రత్యేకమైన బ్రాండ్‌ను సృష్టించుకున్నారాయన. 'గమ్యం', 'వేదం', 'కంచె' వంటి చిత్రాలతో భావోద్వేగాలను లోతుగా ఆవిష్కరించిన క్రిష్ చారిత్రక నేపథ్యంలోని 'గౌతమిపుత్ర శాతకర్ణి'తో విజువల్ గ్రాండియర్‌ను కూడా చూపించారు. కథలో బలం, పాత్రల్లో నిజాయితీ, భావాల్లో సహజత్వం ఇవన్నీ క్రిష్ సినిమాల్లోని ప్రత్యేకతలుగా చెప్పుకోవచ్చు. అందుకే ఆయన నుంచి కొత్త సినిమా వస్తుందంటే ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంటుంది. అయితే గతేడాది విడుదలైన 'ఘాటి' చిత్రం ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయింది. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద నిరాశపరచడంతో క్రిష్ తదుపరి ప్రాజెక్ట్‌పై మరింత జాగ్రత్తగా దృష్టి పెట్టినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. వరుసగా పరాజయాలు పలకరిస్తుండటంతో ఈసారి పూర్తిగా భిన్నమైన కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రావాలని ఆయన భావిస్తున్నారట. తాజా సమాచారం ప్రకారం క్రిష్ రూపొందించబోయే కొత్త చిత్రం అడ్వెంచర్ జానర్‌లో ఉండబోతోంది. ముఖ్యంగా ట్రెక్కింగ్ నేపథ్యంలో సాగే కథగా దీన్ని ప్లాన్ చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. పర్వత ప్రాంతాలు, అడవులు, సహజమైన ప్రకృతి అందాల మధ్య సాగే సర్వైవల్ డ్రామాగా ఈ కథ ఉండవచ్చని చెబుతున్నారు. కమర్షియల్ ఫార్ములాకు భిన్నంగా ప్రకృతి నేపథ్యంతో ఎమోషన్స్, అడ్వంచర్స్ మిళితమై ఉండేలా స్క్రిప్ట్‌ను రూపొందిస్తున్నారట. ఈ ప్రాజెక్ట్‌లో మరో ఆసక్తికర అంశం ఏమిటంటే... ఏకంగా ఏడుగురు హీరోయిన్‌లు ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారని సమాచారం. ఒక్కో పాత్రకు ప్రత్యేకమైన ప్రాధాన్యం ఉండేలా కథను డిజైన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎవరి రోల్ తక్కువ కాకుండా సమతూకంగా చూపించడం క్రిష్‌కి పెద్ద సవాలుగా మారనుంది. సోషల్ మీడియా ప్రభావం ఎక్కువగా ఉన్న ఈ కాలంలో పాత్రల ప్రాధాన్యంపై చిన్న వివాదం వచ్చినా అది పెద్ద చర్చకు దారి తీసే అవకాశం ఉండటంతో, స్క్రిప్ట్ దశ నుంచే జాగ్రత్తలు తీసుకుంటున్నారని తెలుస్తోంది.

Uttejitha:-Printed,editor,Pablished And owned By M.chandrasek her.46-801u2.Budhawerpeta.kurnool.andrapradesh.pin 518002.printed At Uttejitha -Printers.Kurnool.Ap.cell 9440140418. RNI ApTEEL2008/24570.